www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక
FLASH INDIA TELUGU DAILY
RNI NO.APTEL/2010/33229

| సంపుటి : 17 | సంచిక : 175 | మంగళవారం 18.08.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/- |
|---|---|---|---|---|---|

విలేకరులు కావలెను
18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..
సెల్ నెంబర్: 9951494039

## బీజేపీలో పదవుల జాతర..




- పీయూష్ గోయల్‌కు జాతీయ కోశాధికారి బాధ్యతలు
- సంబిత్ పాత్రాకు ఈశాన్య ప్రాంత కోఆర్డినేటర్ పదవి
- తరుణ్ చుగ్‌కు కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జ్ బాధ్యతలు
- కొత్త జాతీయ టీమ్‌లో తెలంగాణకు చోటు దక్కకపోవడంపై చర్చ
- తెలంగాణ బీజేపీ వర్గాల్లో ఆసక్తికర చర్చ

03

## సీజేపీ తరహాలో డీఎన్‌పీ!

### మోడీ 'దిమాగీ నక్సల్స్' వ్యాఖ్యల ఎఫెక్ట్..




- 'ఆలోచించండి.. పరిశోధించండి.. ప్రతిఘటించండి' నినాదంతో ప్రచారం
- సైబర్ దాడులు జరుగుతున్నాయంటూ ఖాతా నిర్వాహకుల ఆరోపణలు
- భగత్ సింగ్ సిద్ధాంతాలను అనుసరిస్తున్నామని వెల్లడి

02

## రాష్ట్రంలోని లబ్ధిదారులకు బిగ్ రిలీఫ్..



ఇప్పటివరకు రూ.16,375.87 కోట్ల వ్యయం
ఆర్టికల్ 162 కింద కార్యనిర్వాహక అధికారాలతో

- పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- హైకోర్టు స్టేపై డివిజన్ బెంచ్‌కు అప్పీల్
- సెప్టెంబర్ 9 వరకు వేచి ఉండం: మంత్రి పొన్నం

03

# సమగ్ర వైద్యం.. ఒకే ప్రాంగణం

## కార్పొరేట్‌కు ధీటుగా వసతులు..



- సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రిని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- అత్యాధునిక వైద్య సదుపాయాలతో సనత్‌నగర్ టిమ్స్ నిర్మాణం
- రూ.1,126 కోట్లతో 1,082 పడకల సామర్థ్యంతో ఆసుపత్రి
- 300 ఐసీయూ బెడ్స్, 31 అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు
- పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా కార్పొరేట్ తరహా వైద్యం
- ప్రారంభోత్సవం అనంతరం ఓపీ కౌంటర్‌ను పరిశీలించిన సీఎం
- 37 ప్రధాన వైద్య విభాగాల్లో సూపర్ స్పెషాలిటీ సేవలు
- గుండె, కిడ్నీ, కాలేయం, మెదడు వ్యాధులకు ప్రత్యేక చికిత్స
- క్యాన్సర్, ట్రామా, అవయవ మార్పిడి సేవలు అందుబాటులోకి
- కార్డియాక్, రీనల్, న్యూరో, ట్రామా సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్

03

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**
అత్యాధునిక వైద్య సదుపాయాలతో నిర్మించిన సనత్ నగర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్ ను సీఎం రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. సీఎం వెంటే ఉన్నారు. ప్రారంభోత్సవం అనంతరం.. ఓపీ కౌంటర్ కు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రూ.1126 కోట్లతో నిర్మించిన సనత్ నగర్ టిమ్స్ లో 1000కి పైగా పడకలు, 300 ఐసీయూ బెడ్స్, దాదాపు 30 వరకూ ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయి.

**కార్పొరేట్‌కు ధీటుగా వసతులు..**
పేద, మధ్యతరగతి ప్రజలకు పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ తరహా వైద్యం అందించాలనే...

# 22-ఏ భూముల బాధితులకు బిగ్ రిలీఫ్..

## క్లియరెన్స్ కోసం ఉన్నతస్థాయి కమిటీ



ప్రైవేట్ ఆస్తులకు పూర్తి భద్రత కల్పిస్తాం

**ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్ 18005994788**

- 22ఏ జాబితాలో ప్రైవేట్ భూములపై ప్రభుత్వం దృష్టి
- సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్న మంత్రి పొంగులేటి
- 22ఏ నుంచి భూముల తొలగింపునకు 757 దరఖాస్తులు
- మేడ్చల్ నుంచే అత్యధికంగా 511 అప్లికేషన్లు
- 22ఏ సమస్యలపై ఇద్దరు అధికారులతో ఉన్నతస్థాయి కమిటీ
- భూ యజమానులు ఆందోళన చెందొద్దన్న మంత్రి
- కోర్టులకు వెళ్లాల్సిన అవసరం లేదు: పొంగులేటి
- న్యాయమైన ప్రైవేట్ భూములకు త్వరలో క్లియరెన్స్
- బాధితులను తిప్పితే అధికారులపై కఠిన చర్యలు


05

# 92 లక్షల మందికి నోటీసులు


## ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు అభ్యంతరాల స్వీకరణ

- ఎస్ఐఆర్ కోసం 2 వేల మందికి పైగా అధికారులు
- నోటీసులకు కారణం స్పష్టంగా తెలియజేస్తాం
- అభ్యంతరాలను పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం
- పత్రాలు సమర్పించి వివరాలు నిర్ధారించుకోవాలి
- అభ్యంతరాలు, దరఖాస్తుల పరిశీలనకు షెడ్యూల్ ఖరారు

02




- 78.30 శాతం ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ పూర్తి
- 2.73 శాతం మంది చనిపోయినవారిగా గుర్తింపు
- 60 లక్షల మంది ఓటర్ల వివరాల్లో అనామలీస్
- 32 లక్షల మంది ఓటర్లు మ్యాపింగ్ కాలేదు



## తెలంగాణలో ప్రారంభమైన కొత్త అథారిటీ..

### టీజీ సేఫ్ అమల్లోకి తెచ్చామన్న సీఎం రేవంత్ రెడ్డి

- ప్రజారోగ్య పరిరక్షణకు సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం
- ఆహారం, ఔషధాల నాణ్యత కోసం 'టీజీ సేఫ్' ఏర్పాటు
- తెలంగాణ సేఫ్‌కు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆహార భద్రత, ఔషధ నియంత్రణ విభాగాలు ఇక ఒకే గొడుగు కిందకు
- కల్తీ ఆహారానికి చెక్ పెట్టడమే టీజీ సేఫ్ లక్ష్యం
- నకిలీ, ప్రమాదకర మందుల విక్రయాలపై కఠిన చర్యలు
- క్షేత్రస్థాయిలో తనిఖీలు మరింత పెంచనున్న ప్రభుత్వం
- నాణ్యతా ప్రమాణాలు పాటించని వారిపై తక్షణ చట్టపరమైన చర్యలు
- ప్రజలకు సురక్షితమైన ఆహారం, నాణ్యమైన మందులు అందించడమే లక్ష్యం

02

## అధికారులు బలి కావాలా?

### సర్కార్ నడుపుతున్నవా.. లేక సర్కస్ నడుపుతున్నవా రేవంత్ రెడ్డి?



- తప్పులను అధికారులపైకి నెట్టే ప్రయత్నం: హరీశ్ రావు
- 22ఏ భూముల వ్యవహారంపైనా తీవ్ర ఆరోపణలు
- మంత్రులు సారీ చెప్పి తప్పించుకుంటే సరిపోదు
- ప్రజల జీవితాలతో ముడిపడిన అంశాల్లో నిర్లక్ష్యంపై ప్రశ్నలు
- ప్రభుత్వ వైఫల్యంపై ముందుగా చర్యలు తీసుకోవాలి
- ప్రజలు ప్రభుత్వంపై సీరియస్‌గా ఉన్నారన్న హరీశ్ రావు
- కళ్యాణలక్ష్మి పథకం ఆగకూడదని డిమాండ్

03



# కిల్లర్ ఫ్యామిలీ

## కొడుకును కూడా హత్యలకు ప్రేరేపించిన తల్లి.!

**భూంపల్లి,ఫ్లాష్ ఇండియా :** సిద్ధిపేట జిల్లా భూంపల్లి సీరియల్ మర్డర్ కేసులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రజిత గతంలోనూ తన భర్త దుబ్బయ్యను హత్య చేసేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. తాజాగా ఈ కేసుకు సంబంధించి ఆమె భర్త, మృతుల కుటుంబ సభ్యులు వెల్లడించిన వివరాలు సంచలనంగా మారాయి. రజిత గతంలో రెండుసార్లు తనను హత్య చేసేందుకు ప్రయత్నించిందని ఆమె భర్త దుబ్బయ్య ఆరోపించారు. ఒకసారి రోకలి బండతో తన తలపై మోది చంపేందుకు ప్రయత్నించిందని తెలిపారు. తాను ఉల్టా పడుకోవడంతో తలకు బదులుగా కాళ్లపై రోకలి బండతో కొట్టిందని చెప్పారు. మరోసారి వేడి నీళ్లు తనపై పోసి తీవ్రంగా హింసించిందని ఆరోపించారు. అనారోగ్యంతో ప్రస్తుతం మంచానికే పరిమితమైన దుబ్బయ్య.. తాను గతంలో కూలి పని చేసుకునేవాడినని, రజిత చర్యల కారణంగా తన పరిస్థితి దారుణంగా మారిందని వాపోయారు. తనను చంపేందుకు ప్రయత్నించిన రజితను కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. రజిత తన మైనర్ కుమారుడిని కూడా డబ్బు, బంగారం ఆశ చూపి హత్యలకు ప్రేరేపించినట్లు సమాచారం. తన కుమారుడు చదువులో బాగా రాణించేవాడని దుబ్బయ్య తెలిపారు. పదో తరగతిలో 504 మార్కులు సాధించిన తన కుమారుడిని డబ్బు, బంగారం ఆశ చూపి చదువుకు దూరం చేసిందని ఆరోపించారు. కాలేజీలో చేర్పించినప్పటికీ అతడు సరిగా కాలేజీకి వెళ్లేవాడు కాదని తెలిపారు. హత్యలు చేసేందుకు శారీరకంగా బలంగా ఉండాలని చెప్పి జిమ్ సామగ్రిని కూడా ఇప్పించిందని ఆరోపించారు. ఇంట్లోనే జిమ్ చేసేవాడని చెప్పారు. భూంపల్లి డబుల్ బెడ్‌రూం ఇళ్లలో రజిత, ఆమె భర్త దుబ్బయ్య, మైనర్ కుమారుడు నివసిస్తున్నట్లు సమాచారం. రజిత అక్కడ కిరాణా షాప్‌తో పాటు టీ స్టాల్ నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో టీ స్టాల్‌కు వచ్చే వ్యక్తుల్లో ఆస్తి తగాదాలు, ఇతర వివాదాలు ఉన్నవారిని.. ముఖ్యంగా ఒంటరి మహిళలను తల్లి, కొడుకు గుర్తించేవారని పోలీసులు తెలిపారు. వారిని టార్గెట్ చేసుకుని పరిచయం పెంచుకుని అనంతరం హత్య చేసి వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలను దోచుకునేవారని దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి పోలీసులు దర్యాప్తు ఇంకా కొనసాగిస్తున్నారు. రజిత తొలుత ఇన్‌స్టాగ్రామ్‌లో యాక్టివ్‌గా ఉండే రేఖ అనే మహిళను టార్గెట్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మే నెలలో రేఖను హత్య చేసి, ఆమె ఒంటిపై ఉన్న నగలను దోచుకున్న అనంతరం మృతదేహాన్ని స్థానిక అడవుల్లోకి తీసుకెళ్లి పెట్రోల్ పోసి తగలబెట్టారు. రేఖను హత్య చేసిన తర్వాత.. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం ఉన్న వ్యక్తులపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తారని రజిత అనుమానం రాకుండా వ్యవహరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 7న అదే గ్రామానికి చెందిన అతికం విజయను కూడా రజిత హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. విజయకు తన దాయాదులతో భూ తగాదాలు ఉండటంతో ఆమె హత్యకు గురైతే కుటుంబ వివాదాల కారణంగానే జరిగిందని పోలీసులు భావిస్తారని రజిత భావించిందని సమాచారం. విజయ మృతదేహాన్ని అచ్చాయిపల్లి అడవుల్లోకి తీసుకెళ్లి తగలబెట్టాలని తల్లి, కొడుకు భావించగా.. భారీగా వర్షం కురుస్తుండటంతో మార్గమధ్యంలోని రామక్కపేట వద్ద రోడ్డు పక్కన మృతదేహాన్ని పడేసి పెట్రోల్ పోసి తగలబెట్టారు. రజిత చేతిలో తొలుత హత్యకు గురైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రేఖ భర్త తన ఆవేదనను వ్యక్తం చేశారు. ఇద్దరు పిల్లలను ఇంట్లో పడుకోబెట్టి పాల ప్యాకెట్ కోసం రజిత షాప్‌కు వెళ్లిన తన భార్య తిరిగి ఇంటికి రాలేదని తెలిపారు. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదని, నిన్నటి వరకు కూడా ఆమె కోసం వెతుకుతూనే ఉన్నామని చెప్పారు. అయితే పోలీసులు వచ్చి తన భార్య చనిపోయిందని చెప్పడంతో షాక్‌కు గురయ్యామని తెలిపారు. రజితే హత్య చేసినట్లు పోలీసులు చెప్పారని, తన భార్య ఒంటిపై ఉన్న నగల కోసమే ఈ హత్య జరిగిందని తెలిసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తన భార్య హత్యకు గురైన విషయం తెలిసినప్పటికీ రజిత ఏమీ తెలియనట్లు నటించిందని రేఖ భర్త ఆరోపించారు. "రేఖ దొరికిందా?" అంటూ తమను అడిగిందని తెలిపారు. నిందితురాలిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# సీజేపీ తరహాలో డీఎన్‌పీ!

**న్యూ ఢిల్లీ :** కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన సోషల్ మీడియా ప్రచారం, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమం సక్సెస్ కావడంతో ఇతర అంశాలపై కూడా ఇదే తరహా నరసనలు ఆన్ లైన్ ఉద్యమాలు పొట్టుకువస్తున్నాయి. సుప్రీంకోర్టు ప్రధాన నాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చేసిన బొద్దింకల వ్యాఖ్యలు దేశ రాజకీయాలనే షేక్ చేయగా తాజాగా ప్రధాని నరేంద్ర మోడీ స్వాతంత్ర్య దినోత్సం సందర్భంగా ఎర్రకోట నుంచి చేసిన ప్రసంగం మరో ఆన్ లైన్ ఆందోళకు వేదికగా మారింది. మోడీ తన స్పీచ్‌లో దిమాగీ నక్సల్స్ అనడం తీవ్ర దుమారం రేపుతోంది. మోడీ వ్యాఖ్యలకు కౌంటర్ గా తాజాగా సోషల్ మీడియాలో 'దిమాగీ నక్సల్ జనతా పార్టీ ' పేరుతో కొత్తగా సెటైరికల్ ఖాతా ప్రత్యక్షం కావడం సంచలనంగా మారింది.

**రాత్రికి రాత్రే భారీగా ఫాలోవర్స్:**

వెలుగులోకి వచ్చిన 24 గంటల్లోనే 'దిమాగీ నక్సల్ పార్టీ' ఇన్‌స్టాగ్రామ్ ఖాతా 2,04,000 (204K) ఫాలోవర్లను సంపాదించి రికార్డు సృష్టించింది. ఈ అకౌంట్‌కు 77 పోస్ట్‌లను పోస్ట్ చేయగా, సుమారు 38 మందిని ఫాలో అవుతోంది. దీంతో సీజేపీ తరహాలోనే దిమాగీ నక్సల్ పార్టీ కూడా ఇప్పుడో ఉద్యమంగా మారుతుందా అనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. అయితే ఈ దిమాగీ నక్సల్స్ పార్టీతో పాటు దిమాగీ నక్సల్ జనతా పార్టీ పేరుతో ఉన్న మరొక ఖాతాకు కూడా వేలలో ఫాలోవర్లు చేరారు. ఆలోచించండి, పరిశోధించండి, ప్రతిఘటించండి అనే నినాదంతో ఈ ఖాతాలు నడుస్తున్నాయి. ఆగస్టు 2026లో ప్రారంభమైన తమ ఖాతాపై సైబర్ దాడులు జరుగుతున్నాయని, గొంతులను అణచివేసే ప్రయత్నం చేస్తున్నారంటూ దిమాగీ నక్సల్ పార్టీ X వేదికగా ఆరోపించింది. తాము భగత్ సింగ్ సిద్ధాంతాలను అనుసరిస్తున్నామని పోస్టులలో వెల్లడించింది.

**మారుతున్న ఉద్యమరూపాలు:**

దేశంలో హ్యాట్రిక్ విజయం సాధించి మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గతంలో పెద్దగా తీవ్రస్థాయి ఉద్యమాలేవీ ఊపందుకోలేదు. అయితే, నీట్ పరీక్ష వివాదం తీవ్ర కలకలం రేపిన వేళ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన డిజిటల్ ఆందోళన అనూహ్య విప్లవంగా మారింది. సీజేపీ నేతృత్వంలో సాగిన ఈ ఉద్యమానికి ఊహించని రీతిలో మద్దతు లభించడంతో కేంద్ర ప్రభుత్వం డిఫెన్స్‌లో పడక తప్పలేదు. సీజేపీ పోరాట తీవ్రతకు దిగివచ్చిన మోడీ సర్కార్ ఎట్టకేలకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించాల్సి వచ్చింది. కాక్రోచ్‌ల ఉద్యమం సక్సెస్ కావడంతో ఆ వెంటనే సోషల్ మీడియాలో రిజర్వేషన్ హటావో ఆందోళన్(ఆర్‌హెచ్‌ఏ), ఇథనాల్ బ్లెండెడ్‌కు నిరసనగా ఈ-20 జనతా పార్టీ పేరుతో మరో సెటైరికల్ పార్టీ పుట్టుకు వచ్చాయి. ఈ పెండు అంశాలపై దేశవ్యాప్తంగా మంచి ఆధరణే వచ్చింది. ఈ నేపథ్యంలో తాజాగా మోడీ వ్యాఖ్యలకు నిరసనగా దిమాగీ నక్సల్స్ పేరుతో కొత్త ఖాతా పుట్టుకురావడం దేశంలో మారుతున్న ఉద్యమరూపాలకు నిదర్శనం అనే టాక్ వినిపిస్తోంది.



## 92 లక్షల మందికి నోటీసులు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. ఎస్ఐఆర్ ప్రక్రియలో మొదటి భాగం పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 78.30 శాతం ఎన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇందులో 2.73 శాతం మంది చనిపోయినవారిగా గుర్తించినట్లు సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. మరోవైపు సుమారు 60 లక్షల మంది ఓటర్ల వివరాల్లో అనామలీస్ ఉన్నట్లు తెలిపారు. అలాగే 32 లక్షల మంది ఓటర్లు మ్యాపింగ్ చేసుకోలేదని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో సుమారు 92 లక్షల మందికి నోటీసులు జారీ చేయనున్నట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు సంబంధిత పత్రాలను సమర్పించి తమ వివరాలను నిర్ధారించుకోవాలని సూచించారు. నోటీసులు అందుకున్న వారు వీలైనంత త్వరగా స్పందించాలని అధికారులు కోరారు. ఏ కారణంతో నోటీసు జారీ చేశామో స్పష్టంగా తెలియజేస్తామని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఓటు తొలగింపుపై అభ్యంతరాలు ఉన్నవారు తమ అభ్యంతరాలను సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు అభ్యంతరాలు, సంబంధిత దరఖాస్తులను పరిశీలించనున్నట్లు అధికారులు వెల్లడించారు. పరిశీలన ప్రక్రియ పూర్తయిన అనంతరం అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 2 వేల మందికి పైగా అధికారులు పాల్గొంటారని సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు.

# వేములపల్లిలో తక్షణమే ఫ్లైఓవర్ నిర్మించాలి

**నల్లగొండ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ నియోజకవర్గంలోని వేములపల్లి మండల కేంద్రం మీదుగా వెళ్లే చీఎ-167 నార్కట్‌పల్లి--అద్దంకి జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే వేములపల్లి గ్రామంలో ఫ్లై ఓవర్ నిర్మించాలని కోరుతూ, బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్పీ) నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఎస్పీ నాయకులు మాట్లాడుతూ, వేములపల్లి వద్ద రహదారి దాటే సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ట్రాఫిక్ రద్దీతో ప్రమాదాల ముప్పు పెరుగుతోందని తెలిపారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు వేములపల్లి మండల కేంద్రంలో తక్షణమే ఫ్లైఓవర్ నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రావులపాటి రవిశంకర్, పార్లమెంట్




ఇంచార్జి పంటపాక యాదగిరి, భువనగిరి పార్లమెంట్ ఇంచార్జి కత్తుల కాన్షీరామ్, బొడ్డు కిరణ్, భాషపాక శివ, మధు యాదవ్, పుట్ట దినేష్, గాలిబు, తగరం సుభాష్ చంద్రబోస్, వంటపాక కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## రాజేంద్రనగర్‌లో 2.47 లక్షల ఓటర్లకు షాక్..!

**రాజేంద్రనగర్,ఫ్లాష్ ఇండియా :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటర్ల లెక్కింపు, నమోదు ప్రక్రియ అనంతరం రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన డ్రాఫ్ట్ ఓటరు జాబితాను సోమవారం విడుదల చేశారు. నియోజకవర్గంలోని 521 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 3,88,278 మంది ఓటర్లు ఉన్నట్లు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సర్‌కు ముందు నియోజకవర్గంలో 6,35,283 మంది ఓటర్లు ఉండగా.. ప్రస్తుతం 3,88,278 మంది మాత్రమే జాబితాలో ఉన్నారు. ఇందులో 1,95,556 మంది పురుషులు, 1,92,706 మంది మహిళలు, 16 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. సుమారు 2.47 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే 14,824 మంది మృతిచెందినవారిగా గుర్తించినట్లు వెల్లడించారు. పౌరులు తమ ఓటు వివరాలను పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు. అభ్యంతరాలు, సవరణలు ఉంటే ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు సంబంధిత దరఖాస్తులు సమర్పించవచ్చు. అక్టోబర్ 19న తుది ఓటరు జాబితా ప్రకటించనున్నారు. ఓటరు జాబితాలో పేరు లేకుంటే తగిన ఆధారాలతో ఫామ్-6 పూర్తి చేసి ఏఈఆర్‌ఓకు సమర్పించాలి. పోలింగ్ కేంద్రం మార్పు లేదా పేరులో తప్పులు ఉంటే ఫామ్-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. మరిన్ని వివరాల కోసం భారత ఎన్నికల సంఘం, సీఈఓ తెలంగాణ అధికారిక పోర్టళ్లను సందర్శించవచ్చు.

## తెలంగాణలో ప్రారంభమైన కొత్త అథారిటీ..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యతలను, ప్రజారోగ్య పరిరక్షణ దిశగా తీసుకున్న నూతన నిర్ణయాన్ని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజల భద్రత, రక్షణ, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి అంశంలోనూ చట్టం ప్రకారమే పాలన సాగిస్తూ, ప్రజలకు సంపూర్ణ జవాబుదారీతనంతో సేవలు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన సంకల్పమని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో ఆహార పదార్థాలు, నిత్యవసర ఔషధాల నాణ్యతను, భద్రతను పర్యవేక్షించేందుకు ఏకీకృత వ్యవస్థగా 'తెలంగాణ సేఫ్' (టీజీ సేఫ్-తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్) ను అమలులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు వేర్వేరుగా ఉన్న ఆహార భద్రత, ఔషధ నియంత్రణ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి, ప్రజారోగ్య పరిరక్షణకు ఈ నూతన అథారిటీ ద్వారా కఠిన ప్రమాణాలు అమలు చేయనున్నట్లు తెలియజేశారు. దీని ద్వారా మార్కెట్లో లభించే ఆహార పదార్థాల్లో కల్తీని నిరోధించడం, నకిలీ , ప్రమాదకర మందుల విక్రయాలకు అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది. క్షేత్రస్థాయిలో తనిఖీలు పెరిగి, నాణ్యతా ప్రమాణాలు పాటించని వారిపై తక్షణ చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వీలవుతుంది. ఫలితంగా పౌరులకు సురక్షితమైన ఆహారం, సమర్థవంతమైన మందులు అందుబాటులోకి వచ్చి, ప్రజారోగ్యానికి సంపూర్ణ భద్రత చేకూరుతుంది. నాణ్యమైన ఆహారం, సురక్షితమైన మందులు అందించడమే లక్ష్యంగా పనిచేసే 'టీజీ సేఫ్' సేవలను ఉపయోగించుకుంటూ, ఆరోగ్యవంతమైన, సురక్షితమైన తెలంగాణ నిర్మాణంలో రాష్ట్ర పౌరులందరూ భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

## ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు



**భూదాన్ పోచంపల్లి,ఫ్లాష్ ఇండియా :** భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రానికి చెందిన వంగూరి పాండు ఇటీవల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు గాను సోమవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భారత లవ కుమార్, కొయ్యడ శ్రీనివాస్ గౌడ్, కొట్టం కరుణాకర్ రెడ్డి, గునిగంటి వెంకటేష్ గౌడ్, చింతకుంట్ల కృష్ణారెడ్డి, మోటే మహేష్, అంకం వినోద్ తదితరులు పాల్గొన్నారు.






ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# రాష్ట్రంలోని లబ్ధిదారులకు బిగ్ రిలీఫ్..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలుకు తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఇవాళ సెక్రటేరియట్‌లో మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకాలపై ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ మొసలి కన్నీరు కారుస్తూ నిరసనలు తెలుపుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగా నిధుల విడుదల ఆలస్యమైనప్పటికీ, తాము బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నామని పేర్కొన్నారు.

**హైకోర్టు స్టేపై డివిజన్ బెంచ్‌కు అప్పీల్..**

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టులో దాఖలైన రిట్ పిటిషన్‌లో పథకానికి సంబంధించి గతంలో జారీ చేసిన 8 జీవోలపై హైకోర్టు ఆగస్టు 12న మధ్యంతర ఆదేశాలు ఇస్తూ సెప్టెంబర్ 9 వరకు నిలిపివేత విధించిందని మంత్రి పొన్నం తెలిపారు. ఈ పథకాన్ని పూర్తిగా ఎత్తివేయలేదని, కేవలం రాజకీయ పిటిషన్ల కారణంగా స్టే ఇచ్చారని వివరించారు. సెప్టెంబర్ 9 వరకు వేచి చూడకుండా స్టేను తొలగించేందుకు తక్షణమే డివిజన్ బెంచ్‌ను ఆశ్రయిస్తున్నామని తెలిపారు. 2014లో గత ప్రభుత్వం పథకానికి సంబంధించి లోపభూయిష్టమైన జీవోలు ఇవ్వడం వల్లే ఈ చట్టపరమైన చిక్కులు తలెత్తాయని ఆరోపించారు. కోర్టులో కౌంటర్ ఫైల్ చేయడంలో ప్రభుత్వ న్యాయ విభాగాల లోపమా, అధికారుల జాప్యమా అనే దానిపై అంతర్గత విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

**నిధులకు శాసనసభ ఆమోదం ఉంది..**

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు రాజ్యాంగంలోని ఆర్టికల్-162 కింద లభించిన కార్యనిర్వాహక అధికారాల ద్వారా అమలవుతున్నాయని, ఇవి డెలిగేటెడ్ లెజిస్లేషన్ కావని పొన్నం ప్రభాకర్ వివరించారు. నిధులకు శాసనసభ ఆమోదం ఉందని, ట్రెజరీ నిబంధనల ప్రకారమే నిధులు వెచ్చిస్తున్నందున ప్రజాధనంపై నియంత్రణ లేదనడం సరికాదన్నారు. వివాహానికి 18 ఏళ్లు నిండాలనే నిబంధనతో పాటు ఆర్డీవో, ఎంఆర్ఓ స్థాయిలలో పక్కా వెరిఫికేషన్ వ్యవస్థ ఉందన్నారు. ఆర్టికల్ 46 ఆశయాలకు అనుగుణంగా సామాజిక న్యాయం, బలహీన వర్గాల ఆర్థిక పరిపుష్టి కోసమే ఈ నిధులు వెచ్చిస్తున్నట్లు మంత్రి పొన్నం పేర్కొన్నారు.

**ఇప్పటి వరకు రూ.16,375.87 కోట్ల ఖర్చు**

రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పథకాల ప్రారంభం నుంచి ఇప్పటి వరకు రూ.16,375.87 కోట్ల ఖర్చుతో మొత్తం 16,78,347 మందికి ప్రయోజనం చేకూర్చినట్లు ప్రభుత్వం కోర్టుకు వెల్లడించిందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా రూ.2,734.81 కోట్లతో 2,73,164 మందికి, ఎస్టీ సంక్షేమం కింద రూ.1,801.48 కోట్లతో 1,79,939 మందికి, బీసీ సంక్షేమం ద్వారా రూ.7,803.05 కోట్లతో 7,79,401 మందికి, ఈబీసీ సంక్షేమం కింద రూ.831.70 కోట్లతో 83,074 మందికి, మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా రూ.3,204.83 కోట్లతో 3,62,769 మంది లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించినట్లు వివరించారు. పేద ఆడబిడ్డల పెళ్లి ఆర్థిక భారాన్ని తగ్గించే ఈ పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదని, చట్టపరమైన అవరోధాలను దాటుకుని త్వరలోనే పథకాన్ని కొనసాగిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసానిచ్చారు.



# డివిజన్ స్థాయి ప్రజావాణి కి 17 ఫిర్యాదులు

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**

డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని మిర్యాలగూడ ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో ఎస్ రమణారెడ్డి మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా ఆర్డిఓ మిర్యాలగూడ కార్యాలయానికి 1,తహసిల్దార్ ఆఫీస్ మిర్యాలగూడ కు 4, తాసిల్దార్ ఆఫీస్ దామరచర్లకు 2,తహసిల్దార్ ఆఫీస్ మాడుగులపల్లి 1,తహసిల్దార్ ఆఫీస్ పెద్దవూర 1, తహసిల్దార్ ఆఫీస్ తిరుమలగిరి సాగర్ కు 1,తహసిల్దార్ ఆఫీస్ అనుముల కు 1,ఫిర్యాదులు మొత్తం 17 వచ్చినట్లుగా వారు తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను వారి కార్యాలయానికి పంపి ఫిర్యాదుదారుల సమస్యలు త్వరగా పరిష్కారం అయ్యేటట్లుగా చూస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు పలువురు పాల్గొన్నారు.

# బీజేపీలో పదవుల జాతర..

**ఢిల్లీ:** బీజేపీ అధిష్టానం కొత్త కార్యవర్గాన్ని ప్రకటించింది. పార్టీ జాతీయ ఉపాధ్యక్షులుగా 13 మంది సీనియర్ నాయకులను నియమించింది. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే సింధియా, బీజేపీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్‌లతో పాటు మరికొందరు సీనియర్ నాయకులను జాతీయ ఉపాధ్యక్షులుగా నియమించింది. మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులవడం గమనార్హం. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఈ నియామకాలను ప్రకటించారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపారు. జాతీయ ఉపాధ్యక్షులుగా నియమితులైన 13 మంది నాయకులలో రాజే, మాధవ్‌లతో పాటు ఈ జాబితాలో ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి తిరత్ సింగ్ రావత్, బైజయంత్ జే పాండా, డి పురందేశ్వరి, రేఖా వర్మ, వర్షబెన్ నరేంద్రభాయ్ దోషి, భారతీ ప్రవీణ్ పవార్, మన్‌ప్రీత్ సింగ్ బాదల్, లాల్ సింగ్ ఆర్య, ఎం నాగరాజా, తారిఖ్ మన్సూర్, మధుచంద్ర కర్ ఉన్నారు. బీజేపీ ఎనిమిది మంది జాతీయ ప్రధాన కార్యదర్శులను నియమించింది. ఈ జాబితాలో స్మృతి ఇరానీతో సహా వినోద్ తావ్డే, సునీల్ బన్సల్, బిప్లబ్ కుమార్ దేబ్, సతీష్ పూనియా, గజేంద్ర పటేల్, హరీష్ ద్వివేది, సంజయ్ భాటియా ఉన్నారు. బీజేపీ సంస్థాగత కార్యదర్శి బీఎల్ సంతోష్ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత)గా కొనసాగనుండటం గమనార్హం. శివప్రకాష్, సౌదాన్ సింగ్‌లు జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శులు (సంస్థాగత)గా నియమితులయ్యారు. పీయూష్ గోయల్ జాతీయ కోశాధికారిగా నియమితులయ్యారు. రాజేష్ మంగళ్ జాతీయ సంయుక్త కోశాధికారిగా నియమితులయ్యారు. పార్టీ తన సంస్థాగత, ప్రచార విభాగాలలో కూడా నియామకాలను ప్రకటించింది. సంబిత్ పాత్రా ఈశాన్య ప్రాంత కోఆర్డినేటర్‌గా నియమితులవ్వగా, తరుణ్ చుగ్ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. జాతీయ స్థాయిలో నియమించిన ఈ టీంలో తెలంగాణ నుంచి ఒక్క బీజేపీ సీనియర్ నేత పేరు కూడా లేకపోవడంపై తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది.

# సమగ్ర వైద్యం.. ఒకే ప్రాంగణం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** అత్యాధునిక వైద్య సదుపాయాలతో నిర్మించిన సనత్ నగర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్ ను సీఎం రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. సీఎం వెంటే ఉన్నారు. ప్రారంభోత్సవం అనంతరం.. ఓపీ కౌంటర్ కు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రూ.1126 కోట్లతో నిర్మించిన సనత్ నగర్ టిమ్స్ లో 1000కి పైగా పడకలు, 300 ఐసీయూ బెడ్స్, దాదాపు 30 వరకూ ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయి.

**కార్పొరేట్‌కు ధీటుగా వసతులు..**

పేద, మధ్యతరగతి ప్రజలకు పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ తరహా వైద్యం అందించాలనే లక్ష్యంతో ఈ ఆసుపత్రిని తీర్చిదిద్దారు. 1082 పడకల సామర్థ్యంతో రూపుదిద్దుకున్న ఈ ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ కోసం ప్రత్యేకంగా 300 ఐసీయూ పడకలు, సంక్లిష్టమైన సర్జరీల కోసం 31 అత్యాధునిక మేజర్ ఆపరేషన్ థియేటర్లను సిద్ధం చేశారు. నిన్నటివరకు సాధారణ ఓపీ సేవలు, ట్రయల్ రన్ మాత్రమే కొనసాగగా.. నేటి ప్రారంభోత్సవంతో పూర్తిస్థాయి సూపర్ స్పెషాలిటీ సేవలు అధికారికంగా రోగులకు అందుబాటులోకి రానున్నాయి.

**సమగ్ర వైద్యం.. ఒకే ప్రాంగణం**

గుండె, కిడ్నీ, కాలేయం, మెదడు సంబంధిత వ్యాధులతో పాటు అత్యవసర ట్రామా, క్యాన్సర్, అవయవ మార్పిడి వంటి 37 ప్రధాన వైద్య విభాగాలకు చెందిన నిపుణులు ఇక్కడ సేవలు అందించనున్నారు. కార్డియాక్, రీనల్, న్యూరో, ట్రామా వంటి కీలక రంగాల్లో ప్రత్యేక 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' కేంద్రాలతో పాటు అధునాతన ఇంటర్వెన్షనల్ రేడియాలజీ, డయాగ్నస్టిక్ ల్యాబ్‌లు రోగులకు వేగవంతమైన వైద్య పరీక్షలను అందించనున్నాయి. ఈ భారీ ప్రాజెక్టు ప్రారంభంతో రాజధాని హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చే రోగులకు గాంధీ, ఉస్మానియా, నిమ్స్‌లపై ఉండే భారం తగ్గి, నాణ్యమైన స్పెషాలిటీ వైద్యం మరింత చేరువకానుంది.

**మీరే టిమ్స్ కడితే ఎందుకు రిబ్బన్ కట్ చేయలేదు.. సీఎం రేవంత్ ఫైర్**

బీఆర్ఎస్ నాయకులు సనత్ నగర్ టిమ్స్ ఆస్పత్రికి కొబ్బరికాయ కొట్టి మర్చిపోయారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరవాతనే నగరంలోని మూడు టిమ్స్ ఆసుపత్రులు వేగంగా పూర్తి చేశామని చెప్పారు. వరంగల్ లోని ఆస్పత్రి నిర్మాణం కూడా వేగంగా పూర్తి అవుతుందని అన్నారు. 2027 డిసెంబర్ నాటికి తెలంగాణలోని ఆస్పత్రులను ప్రారంభిస్తామని చెప్పారు. ప్రతి ఆరు నెలలకు ఒక ఆస్పత్రిని ప్రారంభిస్తామని అన్నారు. దానికోసం నిధులు కేటాయిస్తామని తెలిపారు. వాటి పనితీరు కోసం ప్రత్యేక అధికారులను నియమిస్తామని అన్నారు. సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కేటీఆర్ ను టిమ్స్ వద్దకు తీసుకువచ్చి ఇదంతా వేఎమే కాట్టామని గొప్పలు చెబుతున్నారని విమర్శించారు. టిమ్స్ కట్టడానికి వారికి పదేళ్ల సమయం సరిపోలేదా అని ప్రశ్నించారు. మీరే కడితే మీరే ఎందుకు రిబ్బన్ కట్ చేయలేదని అన్నారు. మీరు కట్టుకున్న ఫామ్ హౌస్ లు కూడా ఆలస్యం అయ్యాయా అని ప్రశ్నించారు. ఉద్యమంలో మీరు ఏం మాట్లాడినా నడిచింది కానీ ఇప్పుడు ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఊరుకునేది లేదని మండిపడ్డారు. పేదల ఆరోగ్యం.. తమ బాధ్యతగా భావిస్తున్నానని అన్నారు. ప్రజాపాలనలో విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని వ్యాఖ్యానించారు. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నామని.. తెలంగాణ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు పొందాలని కృషిచేస్తున్నామని తెలిపారు.



# ఎల్‌నినో ప్రభావంతో రైతులు వర్షాధార పంటలను వేయాలి

**మిర్యాలగూడ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**

మిర్యాలగూడ పట్టణంలోని రైతువేదికలో ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో,రైతులకు ప్రత్యామ్నాయ పంటలు మరియు వర్షాధార పంటల సాగుపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పిసిసి డిలీగెట్ మెంబర్ చిరుమర్రి కృష్ణయ్య, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముదిరెడ్డి నర్సిరెడ్డి,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి మండల వ్యవసాయ అధికారి మేకల ఋషేంద్రమని ,ఏఈఓ మాలవత్ రమేష్ రైతులకు పలు సూచనలు చేశారు. తక్కువ నీటి లభ్యత ఉన్న పరిస్థితుల్లో వరి పంటకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల వర్షాధార పంటలను ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తలకొప్పుల సైదులు ,కేతావత్ జవహర్,ప్రవీణ్,రైతులు మోహన్ రెడ్డి,రాఘవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు బలి కావాలా?




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి విమర్శలు గుప్పించారు. మీ తప్పులకు ప్రభుత్వ అధికారులు బలి కావాలా? తప్పు మీరు చేస్తే శిక్ష వారు అనుభవించాలా? సర్కార్ నడుపుతున్నవా.. లేక సర్కస్ నడుపుతున్నవా రేవంత్ రెడ్డి? అని నిలదీశారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను బంద్ చేయాలనే కుట్ర బయటపడటంతో ఆ తప్పును అధికారులపైకి నెట్టే ప్రయత్నం మంత్రి పొన్నం ప్రభాకర్ చేస్తున్నారని, ఇక 22ఏ నిషేధిత భూముల విషయంలో భూదందా వెలుగులోకి రావడంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి "సారీ" అంటూ తప్పించుకుని, అధికారులపై నెపం నెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు పొన్నం, పొంగులేటి వీడియోలను ఎక్స్ వేదికగా షేర్ చేస్తూ.. ప్రజల జీవితాలతో ముడి పడి ఉన్న అంశాల్లో సరిదిద్దుకోలేని తప్పు చేసి, "సారీ" చెప్పి తప్పించుకుంటే సరిపోదని సీఎం రేవంత్ రెడ్డిని ట్యాగ్ చేశారు.

**మీరు కాదు.. మీపైనే ప్రజలు సీరియస్:**

కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఇక రావేమోనని పేదలు ఆందోళన చెందుతున్నారని, 22ఏ నిషేధిత భూముల వ్యవహారంతో ఎంతోమంది మానసిక వేదనకు గురయ్యారని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులైన అధికారులపై మీరు చర్యలు తీసుకోవడం కాదు.. మీ నిర్లక్ష్యం, మీ ప్రభుత్వ వైఫల్యంపై ముందు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ అధికారులపై మీరు సీరియస్‌గా ఉండటం కాదు.. తెలంగాణ ప్రజలు మీ ప్రభుత్వంపై సీరియస్‌గా ఉన్నారన్నారు. కర్రు కాల్చి వాత పెట్టేందుకు తగిన సమయం కోసం ఎదురు చూస్తున్నారని, మీరు ఎన్ని సార్లు సారీ చెప్పినా ప్రజలకు ఒరిగేది ఏమీ లేదన్నారు. కళ్యాణ లక్ష్మి పథకం ఆగకూడదు. రాష్ట్రవ్యాప్తంగా నిషేధిత జాబితా నుంచి భూహక్కుదారుల భూములను తొలగించి, వారికి పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు.

# అవకతవకల పై చర్యలు తీసుకోవాలి..

**యాదాద్రి,ఫ్లాష్ ఇండియా :** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం, దండు మల్కాపూర్ గ్రామపంచాయతీలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకల పై విచారణ నివేదిక ఆధారంగా సంబంధిత గ్రామ కార్యదర్శి పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామపంచాయతీలో జరిగిన అవకతవకల పై డివిజనల్ పంచాయతీ అధికారి విచారణ నిర్వహించినట్లు పేర్కొన్నారు. గ్రామ కార్యదర్శి రమాదేవి ప్రభుత్వ నిధుల వినియోగంలో అవకతవకలకు పాల్పడినట్లు విచారణలో గుర్తించినట్లు తెలిపారు. సుమారు రూ.53,11,653 మొత్తానికి సంబంధించిన అభ్యంతరాలు ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే, విచారణ నివేదిక సమర్పించి సుమారు 70 రోజులు గడిచినా ఇప్పటి వరకు సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. దీనివల్ల గ్రామ ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో విచారణ నివేదికలో పేర్కొన్న అంశాల పై సమగ్రంగా చర్యలు తీసుకోవడంతో పాటు,



సంబంధిత గ్రామ కార్యదర్శి పై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని, ప్రభుత్వానికి నష్టం వాటిల్లిన మొత్తాన్ని తిరిగి రికవరీ చేయాలని కోరారు. గ్రామపంచాయతీలో జరిగిన అవకతవకల పై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఖర్గే వేదిక శుద్ధీకరణ పై కాంగ్రెస్ ఆగ్రహం

**సంగారెడ్డి అర్బన్,ఫ్లాష్ ఇండియా :** ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన వేదికను మరుసటి రోజు గంగాజలంతో శుద్ధీకరణ చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. కుల, మత విద్వేషాలతో దేశాన్ని విభజించే బీజేపీ కుట్రలను తిప్పికొడతామని నాయకులు ప్రకటించారు. సంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు గంగేరి శ్రీహరి ఆధ్వర్యంలో ఆదివారం భారీ ధర్నా, నిరసన ర్యాలీ నిర్వహించారు. ఐబీ నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి బీజేపీ నాయకుల చర్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ అబ్జర్వర్ దీపక్ రాథోర్, డీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నేరెళ్ల శారద, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, దుద్దిళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం క్యాంపు కార్యాలయం పక్కన ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే, బాబూజగజ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఏఐసీసీ అబ్జర్వర్ దీపక్ రాథోర్, చంద్రమండలానికి మనిషి వెళ్తున్న కాలంలో కూడా బీజేపీ నేతలు దళితుల పట్ల వివక్ష చూపడం సిగ్గుచేటని అన్నారు. మల్లికార్జున ఖర్గే దళితుడు కాబట్టే ఆయన కూర్చున్న వేదికను కడిగారు. ఇది కుల వివక్షకు నిదర్శనం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కులం, మతం పేరుతో దేశాన్ని విడగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, కాంగ్రెస్ కార్యకర్తలు దేశ ఐక్యత, సమగ్రత, సౌహార్దం కోసం పోరాడతారని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విద్యార్థులు, యువత, అన్ని వర్గాల ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటున్నారని, సమాజంలో సామరస్యం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. కాంగ్రెస్ సంఘటన్ సృజన్ కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియ జరుగుతోందని



దీపక్ రాథోర్ తెలిపారు. మరో 5 నుంచి 7 రోజుల పాటు జిల్లాలో పర్యటించి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు సేకరించిన అనంతరం ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించారు. దేశంలో సామాజిక సమానత్వం నిలబెట్టేందుకు కాంగ్రెస్ పోరాటం ఆగదని ఈ సందర్భంగా నాయకులు పునరుద్ఘాటించారు.

# సంపాదకీయం

## సామాజిక న్యాయ సాధనలో కీలకపాత్ర





సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, చారిత్రక నేపథ్యాలలో ప్రపంచ స్థాయిలోనే తనదైన ముద్ర వేసుకున్న అత్యంత పురాతన మూల సంస్కృతుల నెలవు భారతదేశం. సామాజిక న్యాయం, వివక్ష లేని సమసమాజ స్థాపన దిశగా వేర్వేరు కాలాలలో జరిగిన ప్రయత్నాలు.. భారతీయ సమాజ పరిణామ ప్రస్థానంలో పేరెన్నికగన్న ఘట్టాలు. వాటిలో 'సామాజిక న్యాయ సాధన' ప్రముఖమైనది. ఎందుకంటే భారతీయ సమాజం ఎన్నెన్నో అంతస్తులతో, వివిధ రకాల హోదాలతో నిర్మాణమైన నేపథ్యంలో సమాజంలోని అన్ని వర్గాల, వర్ణాల ప్రజల మధ్య సమానత్వ సాధన దిశగా మహనీయులు చేసిన సంస్కరణలు ఎంతో ప్రస్తావించదగినవి. అలా భారతీయ సామాజిక పరిణామక్రమంలో సామాజిక న్యాయ సాధన దిశగా విద్యే ఆయుధంగా కృషి చేసిన మహనీయ పూలే దంపతులు. అందుకే రెండు శతాబ్దాల అనంతరం కూడా నేటికీ జ్యోతిబా పూలే సావిత్రిబాయి పూలేలు సగటు భారతీయులకు, అణగారిన వర్గాలకు చెందిన సమాజాలకు తిరుగులేని స్ఫూర్తిగా, మరిచిపోలేని ప్రేరణగా నిలిచారు. జ్యో తిబా ఫూలే మహారాష్ట్రలోని సతారా ప్రాంతంలో సాధారణ రైతు కుటుంబంలో 1826లో జన్మించారు. రైతులుగా వ్యవసాయం చేయడం వారి వృత్తి అయినప్పటికీ, పూల పెంపకంలో ప్రత్యేకతను సాధించడం విశేషం. పూల తోటల మధ్య పెరిగిన జ్యోతిబా ఆ తర్వాత కాలంలో దేశమంతటా సమానత్వ పుష్పాల పరిమళాలు వెదజల్లాలని, దానికి విద్య సాధనం కావాలని నమ్మాడు. ఆనాటి సమాజంలో ఉన్న కుల వివక్ష, లింగ విచక్షణ, ఆర్థిక అసమానతలు, బాల్య వివాహాలు, వితంతువుల దుర్భర జీవన పరిస్థితులు, రైతుల కష్టాలు వంటివి జ్యోతిబా పూలేను నిరంతరం మదనపడేలా చేశాయి. తన చిన్నప్పటి నుంచి చూసిన సమాజంలో మనుషుల మధ్య ఉన్న అంతరాలు, పెద్ద, చిన్న తేడాలు, మహిళలపై అణచివేత ధోరణులు ఆయనను ఎంతో ఆలోచింపజేశాయి. వీటన్నిటికీ ఒకే మంత్రంగా ఆయన నమ్మిన ఆయుధం విద్య! చదువు ద్వారానే మనిషిలో ఆలోచన ధోరణి విస్తృతం అవుతుందని, మానవులలో సంకుచిత పరిధులు నశించి మానవీయ స్ఫూర్తి మేల్కొంటుంది అని ఆయన ప్రగాఢంగా నమ్మారు.

**సావిత్రీబాయి సహచర్యం**

జ్యోతిబా వివాహం సావిత్రిబాయితో జరగడం, ఆయన జీవితంలో గొప్ప మలుపు. ఆయనలో మొగ్గ తొడుగుతున్న సామాజిక సంస్కరణ భావనలకి తన జీవిత సహచరిగా వచ్చిన సావిత్రిబాయి మంచి ప్రోత్సాహాన్ని, ఉత్సాహాన్ని అందించింది. స్త్రీలకు విద్యను అందించడం ద్వారా కేవలం వారిని మాత్రమే కాక మొత్తం కుటుంబాన్నే సంస్కరించవచ్చు అనే జ్యోతిబా ఆలోచనకు సావిత్రిబాయి ఆలంబనగా నిలిచింది. అందుకే జ్యోతిబా తన సామాజిక సంస్కరణ ప్రస్థానాన్ని తన గృహం నుంచే మొదలెట్టాడు. ఏ చదువు అయితే స్త్రీలకు అక్కరలేదని ఆనాటి కుటుంబ ప్రమాణాలు నిర్దేశించాయో వాటిని ధిక్కరిస్తూ తొలిసారిగా స్త్రీ విద్యా విప్లవ గానానికి సావిత్రిబాయితోనే ఆయన శ్రీకారం చుట్టాడు. ఇంట్లో పెద్దల వ్యతిరేకతను ఎదిరించి సావిత్రిబాయికి అక్షరాభ్యాసం చేయించాడు. విద్యను నేర్పించాడు. ఆమెతో తన ఆలోచనా ధోరణులను పంచుకున్నాడు, చర్చించారు. అలా జ్యోతిబా పూలేకు మొట్టమొదటి అనుచరురాలు ఆయన సహధర్మచారిణి కావడం ఆ తర్వాత కాలంలో వారిద్దరూ కలిసి ఒకే మాట, ఒకే బాటగా సమాజ ఉద్ధరణ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనడం గొప్ప విశేషం.

**బిడెవాడ పాఠశాలతో శ్రీకారం**

సమస్త కుటుంబ ఆచారాలను, సామాజిక దురాచారాలను స్త్రీలలో చైతన్యం ద్వారానే నిర్మూలించాలని, స్త్రీ, బాలికల విద్య ద్వారా సమాజ దృష్టికోణంలో మార్పు తీసుకురావాలని భావించిన పూలే దంపతులు1848లో దేశంలోనే మొట్టమొదటిసారిగా పూణేలో బాలికల కోసం పాఠశాలను ప్రారంభించారు. సామాజికంగా, తల్లిదండ్రుల ఆలోచనపరంగా, ఛాందసవాదులు, సంప్రదాయవాదుల నుంచి ఎంతో వ్యతిరేకతను ఆయన ఎదుర్కొన్నప్పటికీ, బాలికలలో విద్యావ్యాప్తి కోసం ఆ దంపతులు చేసిన కృషి అజరామరంగా నిలుస్తుంది. ప్రతిబంధకాలను, సవాళ్లను, వ్యతిరేకతలను అన్నిటినీ అధిగమించి 'బిడేవాడ'లో ప్రారంభమైన మొట్టమొదటి బాలికల పాఠశాల, ఆ తర్వాత కాలక్రమంలో వందలాది మంది బాలికలకు విద్యా గంధాలను అందించింది.

**సత్యశోధక సమాజ్ స్థాపన**

పూలే దంపతులు బాలికల విద్య కోసం, స్త్రీలలో అక్షరాస్యత కోసం ఒకవైపు పని చేస్తూనే, మరొక వైపు స్త్రీలలో ఆనాటి సమాజంలో ఉన్న దురాచారాలైన బాల్యవివాహాలను, వితంతువులపై చూపే వివక్షను తీవ్రంగా వ్యతిరేకించారు. స్త్రీల సముద్ధరణకు కేవలం భావపరమైన విద్యావ్యాప్తి ఉంటేనే సరిపోదని, వారిలో ఆర్థిక స్వావలంబన కూడా రావాలని ఆశించి స్త్రీలకు వివిధ నైపుణ్యాలలో శిక్షణ ఇవ్వడం కోసం శిక్షణ కేంద్రాలను కూడా రూపొందించారు. ఆ క్రమంలోనే తనలాంటి భావజాలం ఉన్న వ్యక్తులు అందరితో కలిసి 'సత్యశోధక సమాజం' అనే వ్యవస్థని 1873లో స్థాపించారు. కుల, మత, లింగపరమైన వివక్షకు, సామాజిక దోపిడీకి, మూఢనమ్మకాలకు, అసమానతలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేయడమే ఈ సంస్థ లక్ష్యంగా పనిచేసింది. అదే సమయంలో జ్యోతిబా పూలే పత్రికలు, పుస్తకాల ప్రచురణ ద్వారా తన భావజాలాన్ని, తన ఆలోచనా స్రవంతిని మేధావులు, బుద్ధిజీవులలో కూడా విస్తృతంగా వ్యాప్తి చేశారు. ఆయన 1873లో రాసిన 'గులాంగిరి' ఈ దిశగా ఒక గొప్ప ప్రయత్నంగా భావించవచ్చు. అలాగే భారతీయ సమాజంలో అత్యధికంగా ఉన్న రైతుల సమస్యలపై ఆయన రచించిన 'శేట్కార్ యాచ అసుద్' అనే పుస్తకం ప్రముఖమైనది.

**పూలే దంపతులకు ప్రజా ప్రభుత్వం నీరాజనం**

తెలంగాణలో కాంగ్రెస్ సారథ్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం జ్యోతిబాపూలే, - సావిత్రిబాయి పూలేల ఆదర్శాలను ప్రజలందరికీ చేరువ చేయడంలో ఎంతగానో కృషి చేస్తోంది. వారి ఆశయాలను ఆచరణ రూపంలో అందిస్తూ వివిధ పథకాలకు శ్రీకారం చుడుతూ తెలంగాణ సమాజంలో మార్పుకు దారులు వేస్తోంది. అణగారిన, పీడిత, తాడిత, బలహీన వర్గాల సమాజాల ప్రతినిధిగా పూలే దంపతుల స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్ళే దిశగా నిరంతరం ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలోనే తెలంగాణ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే ప్రగతి భవన్‌కు 'జ్యోతిబాపూలే ప్రజాభవన్' అని పేరు పెట్టి ఆయనకు నివాళి అందించింది. అలాగే భారతదేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా చరిత్ర సృష్టించిన సావిత్రిబాయి పూలే జయంతిని (జనవరి 3) ప్రతి ఏటా రాష్ట్ర ఉత్సవంగా ప్రకటిస్తూ జీవో నెంబర్ 9 ద్వారా 'మహిళా ఉపాధ్యాయ దినోత్సవం'గా జరుపుకోవాలని ప్రజా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను హైదరాబాద్ నగర నడిబొడ్డులో ఏర్పాటుచేయడం ద్వారా ప్రజలందరికీ ఒక ఉత్సాహాన్ని, ప్రేరణను ఇచ్చే ప్రయత్నం చేస్తున్నది. మొత్తం 26 అడుగుల ఎత్తు (పది అడుగుల పీఠం, 16 అడుగుల రూపం)తో ఈ విగ్రహాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సారథ్యంలో ఇతర మంత్రులందరి సహకారంతో అత్యంత వైభవంగా రూపొందించి ప్రజలందరికీ అంకితం చేస్తున్నది. రాబోయే తరాలకు పూలే దంపతుల విగ్రహాలు దిక్సూచిగా నిలుస్తాయని, రేపటి 'సామాజిక న్యాయ తెలంగాణ' సాధనకు పూలే దంపతుల ఆదర్శాలు, ఆశయాలు, నిరంతర స్ఫూర్తిగా నిలుస్తాయని నేను నమ్ముతాను. ఆ దిశగా మనం అందరం పయనించాలని ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను.

# తెలంగాణలో డ్రగ్స్ ముప్పు..

తెలంగాణలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతున్నదన్న ఆందోళనకు ఇటీవలి గణాంకాలు మరింత బలం చేకూరుస్తున్నాయి. కేసుల సంఖ్య, అరెస్టులు, స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాల పరిమాణం చూస్తే ఇది కేవలం శాంతిభద్రతలకు సంబంధించిన అంశం కాదని స్పష్టమవుతోంది. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు ఆకర్షితవవుతున్న పరిస్థితి సమాజ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. 2022లో తెలంగాణలో నమోదైన గంజాయి కేసులు 1,171 ఉండగా.. 2024 నాటికి ఆ సంఖ్య 2,158కు పెరిగింది. ఇదే సమయంలో అరెస్టుల సంఖ్య కూడా 2,759 నుంచి 4,894కు చేరింది. 2024లో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, స్థానిక పోలీసులు కలిసి 2,169 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేసి 5,205 మందిని అరెస్టు చేయడంతో పాటు సుమారు 21,616 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2025లోనూ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం 1,304 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేసి 5,505 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. హైదరాబాద్ నగరంలో 2025 జూన్ నుంచి 2026 జూన్ వరకు 563 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదై, రూ.22.17 కోట్ల విలువైన మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ గణాంకాలు ఒక విషయం స్పష్టం చేస్తున్నాయి. మాదకద్రవ్యాల సరఫరా కేవలం మహానగరాలకు పరిమితమైన సమస్య కాదు. పెద్ద నగరాల్లో ఏర్పడే సరఫరా నెట్‌వర్క్‌లు చిన్న పట్టణాలు, జిల్లా కేంద్రాలు, విద్యార్థులు అధికంగా ఉండే ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉంది. అందుకే కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి వంటి పట్టణాల్లో గంజాయి విక్రయాలపై వస్తున్న ఆరోపణలను కూడా అధికారులు తేలిగ్గా తీసుకోకూడదు. అయితే ఆరోపణ వచ్చినంత మాత్రాన ఎవరినీ నిందితులుగా చూడటం సరికాదు. సమగ్ర నిఘా, తనిఖీలు, ఆధారాల సేకరణ, చట్టపరమైన విచారణ ద్వారా వాస్తవాలను నిర్ధారించడం పోలీసుల బాధ్యత. ఇక మరో ముఖ్యమైన అంశం యువత. స్నేహితుల ప్రభావం, ఆసక్తి, మత్తు పదార్థాలపై అవగాహన లేకపోవడం, సోషల్ మీడియా ప్రభావం, కుటుంబ పర్యవేక్షణ లోపం, వ్యక్తిగత ఒత్తిళ్లు వంటి అనేక కారణాలు యువతను మత్తు వైపు నడిపించవచ్చు. "గంజాయి పెద్ద ప్రమాదం కాదు" అనే భావన కూడా ప్రమాదకరమే. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తి ఆరోగ్యంతో పాటు చదువు, ఉద్యోగం, కుటుంబ సంబంధాలు, ఆర్థిక పరిస్థితులపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే డ్రగ్స్‌పై పోరాటం అంటే కేవలం కేసులు నమోదు చేయడం, అరెస్టులు చేయడం మాత్రమే కాదు. అసలు సరఫరా గొలుసును గుర్తించి ఛేదించాలి. డ్రగ్స్ వెనుక ఉన్న ప్రధాన సరఫరాదారులు, ఆర్థిక నెట్‌వర్క్‌లు, స్థానిక పెడ్లర్లపై దృష్టి పెట్టాలి. అదే సమయంలో మత్తుకు బానిసైన వారికి కౌన్సెలింగ్, వైద్య సహాయం, పునరావాసం అందించాలి. పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల ప్రమాదాలపై నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనలో ఆకస్మిక మార్పులను గమనించాలి. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో కనిపించే అసాధారణ మార్పులను నిర్లక్ష్యం చేయకూడదు. స్థానిక ప్రజలు అనుమానాస్పద కార్యకలాపాలను అధికారుల దృష్టికి తీసుకురావాలి. ప్రభుత్వం కూడా జిల్లా కేంద్రాలకే పరిమితం కాకుండా మండలాలు, చిన్న పట్టణాలు, విద్యాసంస్థల పరిసర ప్రాంతాలపై నిరంతర నిఘా పెంచాలి. డ్రగ్స్ సరఫరా ఎక్కడి నుంచి వస్తోంది? ఎవరెవరు మధ్యవర్తులుగా పనిచేస్తున్నారు? యువతకు ఎలా చేరుతోంది? అనే ప్రశ్నలకు సమాధానాలు వెతకాలి. తెలంగాణ యువత భవిష్యత్తును కాపాడటం అంటే కేవలం ఒక నేరాన్ని అడ్డుకోవడం కాదు.. ఒక తరాన్ని కాపాడటం. పోలీసుల కఠిన చర్యలకు కుటుంబాల అప్రమత్తత, విద్యాసంస్థల బాధ్యత, ప్రభుత్వ పునరావాస విధానాలు, ప్రజల సహకారం తోడైతేనే ఈ పోరాటం విజయవంతమవుతుంది. యువత చేతిలో పుస్తకం ఉండాలి.. మత్తు పదార్థం కాదు. డ్రగ్స్‌పై పోరాటం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు.. ప్రతి కుటుంబం, ప్రతి పాఠశాల, ప్రతి పౌరుడి బాధ్యత. తెలంగాణలో గంజాయి, డ్రగ్స్ కేసుల పెరుగుదల ఇప్పుడు ప్రతి కుటుంబం ఆలోచించాల్సిన అంశంగా మారింది. హైదరాబాద్‌లో భారీగా మాదకద్రవ్యాలు పట్టుబడుతున్నాయంటే.. వాటి సరఫరా మార్గాలు చిన్న పట్టణాల వరకు చేరుతున్నాయా అనే ప్రశ్న కూడా తలెత్తుతోంది. కేసులు పెరుగుతున్నాయంటే పోలీసుల పని మరింత పెరగాలి. కానీ పోలీసులే అన్నీ చేయగలరా? ఒక యువకుడు డ్రగ్స్‌కు అలవాటు పడే ముందు అతన్ని గుర్తించగలిగేది కుటుంబమే. అతనిలో వచ్చే మార్పులను గమనించగలిగేది తల్లిదండ్రులే. విద్యార్థి ప్రవర్తనలో మార్పును గుర్తించగలిగేది ఉపాధ్యాయుడు. అందుకే మనం కొన్ని ప్రశ్నలు వేసుకోవాలి. డ్రగ్స్ సరఫరా చేసే అసలు వ్యక్తుల వరకు మన దర్యాప్తు వెళ్తుందా? చిన్న పట్టణాలు, విద్యాసంస్థల పరిసరాల్లో నిఘా సరిపోతుందా? డ్రగ్స్‌కు బానిసైన యువతకు కౌన్సెలింగ్, పునరావాసం అందుతున్నాయా? తల్లిదండ్రులకు తమ పిల్లల్లో డ్రగ్స్ వినియోగానికి సంబంధించిన సంకేతాలపై అవగాహన ఉందా? పాఠశాలలు, కళాశాలల్లో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగుతోందా? ఇవి ప్రభుత్వాన్ని మాత్రమే అడగాల్సిన ప్రశ్నలు కావు. మన సమాజాన్ని మనమే అడగాల్సిన ప్రశ్నలు. డ్రగ్స్‌ను అరికట్టాలంటే సరఫరాను ఆపడం ఎంత ముఖ్యమో.. డిమాండ్‌ను తగ్గించడం కూడా అంతే ముఖ్యం. భయపెట్టడం మాత్రమే కాదు, అవగాహన కల్పించాలి. తప్పు చేసిన యువకుడిని శిక్షించడం మాత్రమే కాదు, అతను తిరిగి సాధారణ జీవితంలోకి వచ్చే అవకాశం కూడా కల్పించాలి. కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి వంటి చిన్న పట్టణాల్లో డ్రగ్స్ విక్రయాలపై ఆరోపణలు వస్తే వాటిని నిర్లక్ష్యం చేయకూడదు. అదే సమయంలో నిర్ధారణ లేకుండా ఎవరిపైనా ఆరోపణలు చేయకూడదు. నిజానిజాలను పోలీసులు ఆధారాలతో తేల్చాలి. చివరికి ఇది ఒక్క పోలీస్ శాఖ సమస్య కాదు.

ఇది మన పిల్లల భవిష్యత్తుకు సంబంధించిన సమస్య. ఒక తల్లిదండ్రిగా మనం అప్రమత్తంగా ఉన్నామా? ఒక ఉపాధ్యాయుడిగా మనం విద్యార్థిని గమనిస్తున్నామా? ఒక పౌరుడిగా అనుమానాస్పద కార్యకలాపాలను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామా? ఈ ప్రశ్నలకు మన సమాజం ఇచ్చే సమాధానమే తెలంగాణలో డ్రగ్స్ వ్యతిరేక పోరాటం భవిష్యత్తును నిర్ణయిస్తుంది. యువతను మత్తు నుంచి దూరం చేయడం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు.. మనందరి సామాజిక బాధ్యత.

# ఫోన్‌లోని మాట కూడా నేరమే..



ఒక క్షణం ఆవేశం.. ఒక ఫోన్ కాల్.. ఒక వాయిస్ మెసేజ్.. ఒక వాట్సాప్ సందేశం. ఆ సమయంలో చిన్న విషయంగా కనిపించిన మాటే రేపు పెద్ద న్యాయ సమస్యగా మారవచ్చు. డిజిటల్ యుగంలో మన చేతిలో ఉన్న ఫోన్ కేవలం సమాచార సాధనం మాత్రమే కాదు.. మన మాటలకు, చర్యలకు డిజిటల్ రికార్డును సృష్టించే సాధనం కూడా. అందుకే ఫోన్‌లో మాట్లాడేటప్పుడు, సామాజిక మాధ్యమాల్లో స్పందించేటప్పుడు సంయమనం పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత. భారతదేశంలో 2024 జూలై 1 నుంచి భారతీయ న్యాయ సంహిత అమల్లోకి వచ్చింది. బెదిరింపులు, మహిళల పట్ల అవమానకరమైన ప్రవర్తన, వేధింపులు వంటి చర్యలకు సంబంధించి ఇందులో పలు నిబంధనలు ఉన్నాయి. ఉదాహరణకు బీఎన్ఎస్ సెక్షన్ 351 క్రిమినల్ ఇంటిమిడేషన్‌ను నిర్వచిస్తుంది. సాధారణ బెదిరింపులకు 351(2) కింద రెండేళ్ల వరకు జైలు, జరిమానా లేదా రెండూ ఉండవచ్చు. మరణం లేదా తీవ్రమైన గాయానికి బెదిరించడం వంటి తీవ్రమైన సందర్భాల్లో 351(3) కింద గరిష్ఠంగా ఏడేళ్ల వరకు శిక్ష ఉండవచ్చు. అదేవిధంగా మహిళల గౌరవాన్ని కించపరిచే మాటలు, సంకేతాలు లేదా చర్యలకు బీఎన్ఎస్ లో ప్రత్యేక నిబంధనలు ఉన్నాయి. సెక్షన్ 79 మహిళను అవమానించే ఉద్దేశంతో చేసే మాట, సంకేతం లేదా చర్యలను నేరంగా పరిగణిస్తుంది. మహిళపై దాడి లేదా క్రిమినల్ ఫోర్స్ వినియోగించి ఆమె గౌరవాన్ని భంగపరిచే ఉద్దేశం ఉంటే సెక్షన్ 74 వర్తించవచ్చు. ఇక్కడ ముఖ్యమైన విషయం ఏమిటంటే.. నేరం జరిగిన ప్రదేశం మారినా నేర స్వభావం మారదు. ఇంట్లో చేసిన ఫోన్ కాల్ అయినా, వాట్సాప్‌లో పంపిన వాయిస్ మెసేజ్ అయినా, సోషల్ మీడియాలో పంపిన సందేశం అయినా.. పరిస్థితులను బట్టి అవి దర్యాప్తులో ఆధారాలుగా మారవచ్చు. అందువల్ల "ఫోన్‌లో అన్న మాటకు ఏం అవుతుంది?" అనే నిర్లక్ష్య ధోరణి ఇక పనికిరాదు. డిజిటల్ గోప్యతకు సంబంధించిన అంశాల్లో సమాచార సాంకేతిక చట్టంలోని సెక్షన్ 66E, అసభ్యకరమైన ఎలక్ట్రానిక్ కంటెంట్‌కు సంబంధించి సెక్షన్ 67, లైంగికంగా స్పష్టమైన కంటెంట్‌కు సంబంధించి సెక్షన్ 67A వంటి నిబంధనలు ఉన్నాయి. కాబట్టి ఎవరి వ్యక్తిగత దృశ్యాలు, ఆడియోలు లేదా ఇతర సున్నితమైన సమాచారాన్ని అనుమతి లేకుండా రికార్డు చేయడం, ప్రసారం చేయడం లేదా పంచుకోవడం తీవ్రమైన పరిణామాలకు దారితీయవచ్చు. అయితే చట్టం ఉందనే కారణంతో ప్రతి ఫోన్ కాల్ లేదా ప్రతి కఠినమైన మాటను వెంటనే నేరంగా పరిగణించడం కూడా సరికాదు. నేరం నిర్ధారణకు సందర్భం, ఉద్దేశం, కంటెంట్, ఆధారాలు, బాధితుడిపై ప్రభావం వంటి అంశాలను దర్యాప్తు సంస్థలు, న్యాయస్థానాలు పరిశీలిస్తాయి. అందుకే చట్టంపై ప్రజలకు సరైన అవగాహన కల్పించడం కూడా అంతే ముఖ్యం. మరోవైపు బాధితులు కూడా ఆధారాలను భద్రపరచాలి. వేధింపులకు సంబంధించిన కాల్ వివరాలు, సందేశాలు, వాయిస్ మెసేజ్‌లు, స్క్రీన్‌షాట్లు, సంబంధిత లింకులు వంటి సమాచారాన్ని తొందరపడి తొలగించకుండా భద్రపరచడం దర్యాప్తులో ఉపయోగపడవచ్చు. సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులను జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా నమోదు చేయవచ్చు. అధికారిక సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 కూడా అందుబాటులో ఉంది. అత్యవసర పరిస్థితుల్లో స్థానిక పోలీసులను సంప్రదించాలని అధికారిక పోర్టల్ సూచిస్తోంది. అయితే ఈ చర్చలో మరో కోణాన్ని కూడా మర్చిపోకూడదు. డిజిటల్ వేదికలు ప్రజలకు భావవ్యక్తీకరణకు అపారమైన స్వేచ్ఛను ఇచ్చాయి. అదే సమయంలో బాధ్యతారహితమైన వ్యాఖ్యలు, వ్యక్తిగత వేధింపులు, బెదిరింపులు, అసభ్యకరమైన సందేశాలు కూడా సులభంగా వ్యాప్తి చెందే పరిస్థితి వచ్చింది. స్వేచ్ఛ అంటే ఎదుటివారి గౌరవాన్ని హరించే హక్కు కాదు. అభిప్రాయ భేదం అంటే దూషించే అనుమతి కాదు. ఆవేశం అంటే బెదిరించే హక్కు కాదు. అందుకే డిజిటల్ పౌరసత్వంపై పాఠశాల స్థాయి నుంచే అవగాహన పెంచాలి. యువతకు చట్టపరమైన బాధ్యతలు తెలియజేయాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులు, న్యాయ నిపుణులు కలిసి సైబర్ వేధింపులు, డిజిటల్ గోప్యత, ఆన్‌లైన్ ప్రవర్తనపై అవగాహన కల్పించాలి. ఫోన్ మన చేతిలో ఉన్నా.. పంపిన మాటపై నియంత్రణ ఎప్పటికీ మన చేతిలో ఉండకపోవచ్చు. ఒకసారి పంపిన సందేశం, వాయిస్ మెసేజ్ లేదా వీడియో డిజిటల్ ప్రపంచంలో మిగిలిపోవచ్చు. అందుకే "పంపే ముందు ఆలోచించు.. మాట్లాడే ముందు సంయమనం పాటించు" అనేది నేటి డిజిటల్ సమాజానికి అత్యవసరమైన పౌరసూత్రం. చట్టం భయపెట్టడానికి మాత్రమే కాదు.. హక్కులను కాపాడటానికి కూడా ఉంది. నేరస్తులకు శిక్ష పడాలి.. బాధితులకు రక్షణ లభించాలి.. అదే సమయంలో సాధారణ పౌరులు చట్టంపై సరైన అవగాహనతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. డిజిటల్ స్వేచ్ఛకు విలువ ఉండాలంటే దానికి తోడు డిజిటల్ బాధ్యత కూడా ఉండాలి.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# 22-ఏ భూముల బాధితులకు బిగ్ రిలీఫ్..




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో నిషేధిత జాబితాల్లో పొరపాట్లు ఉన్న మాట నిజమే. ఇది పాత జాబితాలనే హైకోర్టుకు సమర్పించడం ద్వారా చోటు చేసుకున్నది. దీని వల్ల కొందరు ప్రైవేటు ల్యాండ్ యజమానులకు ఇబ్బంది కలిగిందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గతేడాది డిసెంబరులో పాత ఆస్తుల జాబితాలనే హైకోర్టుకు సమర్పించారు. అవే లిస్టులను స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు సమర్పించడం వల్ల సమస్య తలెత్తిందని అంగీకరించారు. కొన్ని ప్రైవేటు ఆస్తులు వీటిలో ఉన్నాయని, వాటిని వెంటనే తొలగించే ప్రక్రియను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సోమవారం సచివాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులతో సుదీర్ఘ సమీక్ష చేశారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడుతూ.. గతంలో సెటిలైన భూములను, రెగ్యులరైజ్ చేసిన ప్రాపర్టీస్ ని అప్ లోడ్ చేయకపోవడం వల్ల జాబితాలో తప్పులు దొర్లాయన్నారు. ప్రధానంగా యూఎల్సీ ల్యాండ్స్ పార్శిళ్లను పీవోబీలో పెట్టారు. ఐతే అవి వివిధ సందర్భాల్లో రెగ్యులరైజ్ అయ్యాయి. వాటన్నింటినీ త్వరలోనే సరి చేస్తామన్నారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ ప్రాంతాల్లో ప్రభుత్వం వేలం వేస్తే కొనుగోలు చేసిన ప్లాట్లను కూడా నమోదు చేశారు. అలాంటి వాటిని సుమోటోగానే తొలగించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. జెన్యూన్ ఉన్న ఏ ప్రైవేటు ప్రాపర్టీనీ పీవోబీలో చేర్చమని హామీ ఇచ్చారు. ఎవరైనా పీవోబీ సమస్యతో బాధ పడుతుంటే టోల్ ఫ్రీ నంబరు 18005994788 కి కాల్ చేయాలని, తగిన సాయం అందుతుందని ప్రకటించారు.

**జస్ట్ ఒక్క అప్లికేషన్..**

అధికారులే ప్రైవేటు ఆస్తులను తొలగిస్తారని మంత్రి పొంగులేటి చెప్పారు. ఐతే ఇంకా ఎక్కడైనా మిస్సయితే ఎమ్మార్వో, ఆర్డీవో, కలెక్టర్, సబ్ రిజిస్ట్రార్, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ కి ఒక్క అప్లికేషన్ పెట్టుకుంటే ఒకటీ రెండు రోజుల్లనే పరిష్కారమవుతుందని భరోసా ఇచ్చారు. పరిష్కరించే బాధ్యత తనదేనన్నారు. కొన్ని చోట్ల భూ సేకరణ చేస్తే.. పూర్తి సర్వే నంబరును బ్లాక్ చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. వాటిని కూడా పరిష్కరిస్తామన్నారు. ఉదాహారణకు రంగారెడ్డి జిల్లాలో 12 ఎకరాల ల్యాండ్. అందులో యజమాని రెండెకరాలను మాత్రమే భూదానం ఇచ్చారు. ఐతే ఆ రెండు ఎకరాలు ఎక్కడో తెలియదు. దాంతో మొత్తం 12 ఎకరాలను బ్లాక్ చేశారు. ఇప్పుడు అధికారులు ఒకటీ రెండు రోజుల్లో ఆ రెండు ఎకరాలకు కో ఆర్డినేట్స్ ఫిక్స్ చేస్తారని, మిగతా 10 ఎకరాలను పీవోబీ నుంచి తొలగిస్తారన్నారు. ఈ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అలాగే దేవాదాయ, వక్ఫ్, ఫారెస్టు భూముల్లోనూ ఇలాంటి సమస్యలు ఉన్నాయన్నారు.

**ఆఫీసుల చుట్టూ తిప్పించుకుంటే చర్యలే..**

22 ఏ పేరుతో సామాన్య ప్రజలను ఇబ్బంది పెట్టే అధికారం ఎవరికీ లేదని మంత్రి అన్నారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పడం, కావాలని జాప్యం చేయడం, చిన్న సమస్యను పెద్ద సమస్యగా మార్చడం ఇకపై సహించేది లేదు. ప్రజల సమస్యను పరిష్కరించడం అధికారులుగా మీ బాధ్యత అన్నారు. నిజమైన భూ హక్కుదారుడికి న్యాయం చేస్తూనే ప్రభుత్వ భూములు, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలి. ఈ రెండింటిలో ఏ ఒక్కదానిని నిర్లక్ష్యం చేసినా ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. 22 ఏ లో భూమి ఉందనే ఒక్క కారణంతో ప్రజలను తిరస్కరించకూడదు. ఆ భూమి ఎందుకు నిషేధిత జాబితాలోకి వచ్చింది, సంబంధిత రికార్డులు ఏమి చెబుతున్నాయో, వాస్తవ పరిస్థితి ఏమిటో సమగ్రంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలన్నారు.

**ప్రైవేటు ఆస్తులకూ భద్రత..**

ప్రభుత్వ భూములను కాపాడుతూనే ప్రైవేటు ఆస్తులకు భద్రత కల్పిస్తామన్నారు. సీఎస్ 7, సీఎస్ 14 కి సంబంధించిన ల్యాండ్స్ ని కూడా పీవోబీలో నమోదు చేశారు. సుప్రీం కోర్టు గైడ్ లైన్స్, వివిధ కోర్టుల ద్వారా అప్రూవల్స్, అనుమతులు పొందిన వాటిని కండిషనల్ రిజిస్ట్రేషన్ చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ కేసు సుప్రీం కోర్టు ఫుల్ బెంచ్ లో ఉందని, ఆ తీర్పుకు అనుగుణంగా నిర్ణయం ఉంటుందన్నారు. అలాగే జీహెచ్ఎంసీ పరిధిలో 35 నుంచి 38 వేల ల్యాండ్ పార్శిళ్లు పీవోబీలో చేరాయని, వాటిని పరిష్కరిస్తామన్నారు. మేడ్చల్ జిల్లా ఆల్విన్ కాలనీ, ఆస్బెస్టాస్ కాలనీ, నారపల్లి వంటి ప్రాంతాల్లో తలెత్తిన సమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు.

**ఉన్నత స్థాయి కమిటీ వేస్తున్నాం..**

రాష్ట్ర వ్యాప్తంగా పీవోబీ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖల అధికారులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీ వేస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. ప్రతి వారం సమీక్షిస్తుందన్నారు. కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే తాను కూడా జిల్లాల్లో పర్యటిస్తానన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడడంలో తాము 360 కోణంలో చూస్తామన్నారు.

# ఏపీ పాలిటిక్స్‌లో మరో సెన్సేషన్..

**ఆంధ్రప్రదేశ్ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలనం చోటుచేసుకుంది. జనసేన పార్టీ కీలక నేత బోనబోయిన శ్రీనివాస యాదవ్ ను దారుణంగా హత్య చేసేందుకు పక్కా ప్రణాళికతో కుట్ర పన్నిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. గత కొంతకాలంగా శ్రీనివాస యాదవ్‌తో తీవ్ర విభేదాలు ఉన్న వైసీపీ నేత నరేంద్ర రెడ్డి ఈ హత్య కుట్రకు పథకం రచించినట్లుగా బయటపడింది.

**రౌడీ షీటర్‌తో రూ.కోటిన్నర సుపారీ డీల్**

శ్రీనివాస యాదవ్‌ను మట్టుబెట్టేందుకు వైసీపీ నేత నరేంద్ర రెడ్డి ఓ రౌడీ షీటర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ హత్యను పూర్తి చేయడానికి ఏకంగా రూ.కోటిన్నర ఇచ్చేలా సుపారీ డీల్ మాట్లాడుకున్నారు. ఒప్పందంలో భాగంగా ఇవాళ ఉదయం వేళ బోనబోయిన శ్రీనివాస్ జిమ్‌కు వెళ్లే క్రమంలో ఆయనపై దాడి చేసి హత్య చేయాలని పక్కా స్క్రిప్ట్ సిద్ధం చేశారు. ఈ ప్లాన్ అమలు చేయడానికి సుపారీ గ్యాంగ్ ఇప్పటికే రెండుసార్లు రెక్కీ కూడా నిర్వహించినట్లుగా తెలుస్తోంది.

**కుట్ర బయటపడటంతో..**

బోనబోయిన శ్రీనివాస యాదవ్ హత్యకు జరిగిన పక్కా కుట్ర వెలుగులోకి రావడంతో ప్రధాన నిందితుడు నరేంద్ర రెడ్డి పరారీలో ఉన్నారు. ప్రస్తుతం అతడి కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రోజున పెమ్మసానిపై దాడికి యత్నించిన ఘటనలో కూడా నరేంద్ర రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ హత్య కుట్రపై పూర్తి వివరాలు సేకరించేందుకు పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు.

# మెదక్ ఖిల్లా కు అరుదైన అవకాశం..!



**మెదక్,ఫ్లాష్ ఇండియా :** చారిత్రక మెదక్ ఖిల్లా కు అరుదైన అవకాశం దక్కింది. పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్న మెదక్ ఖిల్లా పై పోస్టల్ స్టాంప్ ను ఘనంగా మెదక్ ఇంచార్జి మంత్రి వివేక్ వెంకట స్వామి విడుదల చేశారు. సోమవారం మెదక్ జిల్లా కేంద్రంలోని చారిత్రాత్మక ఖిల్లా పై పోస్టల్ స్టాప్ విడుదల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ లు విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మెదక్ ఫోర్ట్ స్టాంప్ విడుదల చేసిన పోస్టల్ డిపార్ట్మెంట్ కు అభినందించారు. మెదక్ ఖిల్లా ను పర్యాటకరంగంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. చారిత్రాత్మక ఖిల్లా ను టూరిజం సెక్టర్ గా తీర్చిదిద్దుతామని, రాష్ట్ర ప్రభుత్వం తరుపన ప్రతిపాదనలు పంపుతాం చెప్పారు. కేంద్ర టూరిజం శాఖ నుంచి కేంద్రం నుంచి నిధులు రావడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం లు సంయుక్తంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సీఎం గా రేవంత్ అయ్యాక మెదక్ చర్చికి రూ 30కోట్లు అభివృద్ధి కి కేటాయించామని, కేంద్రం పర్యాటక అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తే రాష్ట్రం వాటా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఎంపీ రఘునందన్ రావ్ మాట్లాడుతూ చాలా ఏళ్ల క్రితం నిర్మించిన ప్రాచీన కాలంలో కట్టిన ఖిల్లా పేరు పై పోస్టల్ కవర్ ను ఏర్పాటు చేయడం అభినందనీయం గత పాలకులు మెదక్ జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యానికి గురి చేశారన్నారు. స్వదేశి దర్శన్ ప్రాజెక్ట్ కింద ఖిల్లాను అభివృద్ధి చేస్తామని వివారించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్, మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ నరేశ్ గౌడ్, కౌన్సిలర్ లు, అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ అంతర్గత పోరు

**పాలమూరు,ఫ్లాష్ ఇండియా :** ఉమ్మడి పాలమూరు జిల్లా అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పోరు మళ్లీ పతాక స్థాయికి చేరుతోంది. అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి కొనసాగుతున్న వర్గ విభేదాలు కొంతకాలం స్తబ్దుగా ఉన్నా.. తాజాగా నేతలు చేసిన వ్యాఖ్యలతో ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఎన్నికల అనంతరం అసంతృప్తులను చల్లార్చేందుకు అధిష్ఠానం నామినేటెడ్ పదవుల పందేరం చేసినప్పటికీ, నాయకుల మధ్య అంతరం ఏమాత్రం తగ్గలేదని తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

**వనపర్తిలో మాటల తూటాలు..**

వనపర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి మధ్య సయోధ్య కుదరడం లేదు. ఆదివారం గోపాల్‌పేటలో జరిగిన ఓ కార్యక్రమంలో డాక్టర్ చిన్నారెడ్డి చేసిన సంచలన వ్యాఖ్యలు జిల్లా కాంగ్రెస్‌లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. తనకు కాకుండా అధిష్టానం పార్టీ మారి వచ్చిన వ్యక్తికి పోటీ చేసే అవకాశం ఇచ్చారు.. ఎన్నికల సమయానికి వచ్చినవాళ్లు తిరిగి వెళ్ళిపోతారు.. నన్ను మరో జీవన్ రెడ్డిని చేయవద్దు అంటూ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలు నేరుగా స్థానిక ఎమ్మెల్యే మేఘా రెడ్డిని లక్ష్యంగా చేసుకుని చేసినవేనని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. చిన్నారెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్న ఎమ్మెల్యే వర్గం.. ఈ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతోంది.

**జడ్చర్లలో వినూత్న స్వరం..**

జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని సొంత ప్రభుత్వంపైనే అసంతృప్తి గళం విప్పి సంచలనంగా మారిన ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, తాజాగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మద్దతుగా మాట్లాడటం పార్టీ వర్గాల్లో కొత్త చర్చకు తెరలేపింది. ఎమ్మెల్యే వైఖరి పార్టీ ప్రతిష్టను దెబ్బతీసేలా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**గద్వాలలో ఆధిపత్య పోరు..**

గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గొర్రెల పెంపకం దారుల అభివృద్ధి సమాఖ్య చైర్‌పర్సన్ సరితా తిరుపతయ్య మధ్య వర్గపోరు తాత్కాలికంగా చల్లారినట్లు కనిపించినా, లోలోపల నివురుగప్పిన నిప్పులాగే ఉంది. రానున్న రోజుల్లో ఈ విభేదాలు మళ్లీ రచ్చకెక్కే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**ఆందోళనలో పార్టీ శ్రేణులు..**

అధికారంలోకి వచ్చి పాలనపై పట్టు సాధించాల్సిన సమయంలో ముఖ్య నేతలు బహిరంగంగా విమర్శలు గుప్పించుకోవడం పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తుందని క్షేత్రస్థాయి కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. అంతర్గత సమస్యలను పార్టీ వేదికలపై కాకుండా బాహాటంగా రచ్చకెక్కించడం ప్రతిపక్షాలకు అస్త్రాలు ఇచ్చినట్లవుతోందని సీనియర్లు వాపోతున్నారు. అధిష్ఠానం తక్షణమే జోక్యం చేసుకుని నేతలకు కళ్లెం వేయకపోతే, ఉమ్మడి జిల్లాలో పార్టీ భవిష్యత్తుకు విఘాతం తప్పదనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి.

# జనగణనలో బీసీలకు అన్యాయం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దేశవ్యాప్త కులగణనపై కేంద్రం మోసం చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. జనగణనలో కులగణన చేస్తామని గతంలో ప్రకటించిన మోడీ లెక్కల సేకరణకు వచ్చేసరికి మోసం చేశారని విమర్శించారు. జనగణనపై కేంద్రం ఇచ్చిన సర్క్యులర్ ను సవరించి దేశంలో బీసీల జనాభా ఎంత ఉందో తెలుసుకునే ప్రశ్నను చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు 2027 జనాభా లెక్కల్లో ఓబీసీ/ఎస్ఈబీసీ(సోషల్లీ అండ్ ఎడ్యుకేషనల్లీ బ్యాక్‌వర్డ్ క్లాసెస్) లకు ప్రత్యేక కేటగిరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీకి పొన్నం ప్రభాకర్ ఆదివారం లేఖ రాశారు. 2027 జనాభా లెక్కల్లో ఓబీసీ/ఎస్ఈబీసీల జనాభాను శాస్త్రీయంగా, పారదర్శకంగా నమోదు చేసేలా ప్రత్యేక కేటగిరీ ఏర్పాటు చేయాలని కొరారు.


**తెలంగాణ అనుభవాన్ని పరిగణలోకి తీసుకోండి:**

ఎస్సీ, ఎస్టీతో పాటు ఓబీసీలకు ప్రత్యేక కేటగిరీ, రాష్ట్రాల వారీగా మాస్టర్ కుల డైరెక్టరీ, కులాలకు ప్రత్యేక డిజిటల్ కోడ్‌లు ఏర్పాటు చేయాలని కొరారు. 2011 ఎస్ఈసీసీలో ఎదురైన కులాల పేర్లు, స్పెల్లింగ్‌లు, ఉపకులాల సమస్యలు పునరావృతం కాకుండా ప్రమాణీకృత విధానం అవలంబించాలని, తెలంగాణలో నిర్వహించిన SEEPC సర్వే అనుభవాన్ని కూడా 2027 జనాభా లెక్కల రూపకల్పనలో పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. వెనుకబడిన వర్గాల వాస్తవ జనాభా, సామాజిక-ఆర్థిక పరిస్థితులపై ప్రామాణిక సమాచారం ఉంటేనే రిజర్వేషన్లు, విద్య, ఉపాధి, సంక్షేమం, సమాన ప్రాతినిధ్యానికి సమర్థవంతమైన విధానాలు రూపొందించగలం అని లేఖలో పేర్కొన్నారు.

**బండి సంజయ్ మాట్లాడకపోవడం బాధాకరం:**

ఇవాళ గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడిన పొన్నం బీసీ కులగణనపై కేంద్ర వైఖరిని ఖండించారు. జనగణనపై కేంద్రం విడుదల చేసిన ప్రశ్నావళిలో బీసీల ప్రస్తావన లేదని జనగణన పత్రం 40 ప్రశ్నల్లో ఎస్సీ, ఎస్టీల ప్రస్తావన మాత్రమే ఉందని విమర్శించారు. పూర్తి స్థాయి కులగణన చేస్తామని చెప్పి ప్రశ్నావళిలో బీసీల ప్రస్తావన పేర్కొనలేదని దుయ్యబపట్టారు. బీసీ అని చెప్పుకునే మోడీ బీసీల కోసం ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఒత్తిడి వల్లే దేశవ్యాప్తంగా కులగణనకు కేంద్రం దిగివచ్చిందని అయితే జనగణనలో కులగణన చేస్తామని గతంలో ప్రకటించిన మోడీ లెక్కల సేకరణకు వచ్చేసరికి మోసం చేశారని విమర్శించారు. జనగణనపై కేంద్రం ఇచ్చిన సర్క్యులర్ ను సవరించి దేశంలో బీసీల జనాభా ఎంత ఉందో తెలుసుకునే ప్రశ్నను చేర్చాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎవరి జనాభా ఎంత ఉందో తెలిస్తే న్యాయం జరుగుతుందన్నారు. బీసీలకు ఇంత అన్యాయం జరుగుతుంటే బీసీ అయిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా స్పందించకపోవడం బాధాకరం అన్నారు. బండి సంజయ్ వందేమాతరం గురించి కాదు బీసీల గురించి మాట్లాడాలన్నారు.

# ఏకంగా 93 లక్షల మందికి నోటీసులు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో సమగ్ర ఓటరు సవరణ ముసాయిదా ఓటర్ల జాబితాను ఇవాళ ప్రకటించనున్నారు. పోలింగ్ స్టేషన్లు, మండలాల వారీగా ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. ఈ ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను సెప్టెంబర్ 16 వరకు స్వీకరిస్తారు. నోటీసులు జారీ చేయడం, వాటికి సమాధానాలను అక్టోబరు 15 వరకు స్వీకరిస్తారు. రాష్ట్రంలో 3,38,26,448 మంది ఓటర్లు ఉండగా ఇందులో 78.30 శాతం ఓటర్లు 2,64,87,214 తమ ఎన్యూమరేషన్ ఫారాలను అందించారు. మరొక 21.70 శాతం ఓటర్లు 73,39,234 మంది ఎన్యూమరేషన్‌ఫారాలను అందించలేదు. వీరిలో 9.22 లక్షల మంది చనిపోయినట్టుగా, 11.25 లక్షల మంది ఆబ్సెంట్, ఆన్‌ట్రాకబుల్, 45.18 లక్షల మంది శాశ్వతంగా షిఫ్ట్ అయినవారు, 6.70 లక్షల మందికి ఇప్పటికే మరొక చోట ఓట్లు ఉన్నాయని, ఇతరులు 1.02లక్షల ఉన్నారని ప్రకటించారు. వీరి వివరాలన్నంటిని సోమవారం పోలింగ్ స్టేషన్‌ల వారీగా ప్రచురిస్తారు. వీటితో పాటుగా రాష్ట్రంలో 2.64 కోట్ల మంది ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారాలను అందించగా, వీరిలో 32 లక్షల మంది ఓట్లు మ్యాపింగ్ కాలేదని, 2002 లో తమకు కానీ, తమ తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల ఓట్లు వివరాలను సమర్పించలేదు.

**రేపటి నుంచి నోటీసులు..**

మ్యాపింగ్ కాని వారికి ఎన్నికల అధికారులు మంగళవారం నుంచి నోటీసులు జారీ చేస్తారు. వీరిలో కేంద్ర ఎన్నికల సంఘం సూచించిన 11 రకాల డాక్యుమెంట్లలో ఏదైనా ఒక డాక్యుమెంట్‌ను సమర్పిస్తే వారికి ఓటు కొనసాగుతుంది. లేకుంటే వారి ఓటును తొలగిస్తారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 32 లక్షల మంది ఉండటంతో వీరికి నోటీసులు జారీ ప్రక్రియను ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు బీఎల్‌వోల ద్వారా నోటీసులు అందిస్తారు. వీరితో పాటుగా రాష్ట్రంలో 61 లక్షల ఓటర్ల పేర్లలో 2002 ఓటరు జాబితాకు 2025 ఓటరు జాబితాలో ఉన్న పేరులో తేడాలు ఉన్నాయని గుర్తించారు. ఇలా పేర్లలో 11 రకాల తప్పులు, తేడాలు ఉన్నాయని గుర్తించారు. ఇలా ఉన్న 61 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేస్తారు. వీరిందరికీ నోటీసులు జారీ చేస్తారు. నోటీసులు జారీ చేసిన వారం రోజుల్లో సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. వారు సమర్పించే డాక్యుమెంట్ల ఆధారంగా పరిశీలించి ఓటు కొనసాగించాలా లేదా నిర్ణయిస్తారు. ఒకే ఇంట్లో అన్నతమ్ముళ్లు, అక్క చెల్లెల్లు, అన్న చెల్లిలి వయస్సు మధ్య 9 నెలల కంటే తక్కువ వయస్సు ఉండటం, తండ్రికి, కొడుక్కి, తల్లికి కొడుక్కి మధ్య కనీసం వయస్సు గ్యాప్ ఉండటం, మరికొందరు తండ్రి లేదా తల్లి వయస్సుకు, పిల్లల వయస్సుకు తేడా కనీసం 15 సంవత్సరాలు ఉండాల్సి ఉండగా అంత కంటే తక్కువ వయస్సు గ్యాప్ పిల్లలు, తల్లిదండ్రులకు ఉందని గుర్తించారు. అదే సమయంలో కొందరు తల్లిదండ్రులు, పిల్లల వయస్సు గ్యాప్‌లో 50 సంవత్సరాలకు పైగా ఉందని గుర్తించారు. ఇదే తరహాలో తాత, నానమ్మ వయస్సుకు మనవడి వయస్సుకు 40 సంవత్సరాల కంటే తక్కువ గ్యాప్ ఉందని, గతంలో చేపట్టిన ఎస్ఐఆర్‌కు ఇప్పటి ఓటరు జాబితాలో వయస్సులో గ్యాప్ ఎక్కువగా ఉందని ఇలా రకరకాలుగా కారణాలతో అనామలిస్ జాబితాలో చేర్చారు. వయస్సు నమోదు చేసుకున్నప్పుడు ఏదైనా పొరపాటున ఇలా జరిగి ఉంటుందని, పుట్టిన తేదీ సర్టిఫికెట్ చూపిస్తే సరిపోతుందని చెబుతున్నారు. అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో ఏకంగా 11లక్షలు ఇలా పేర్లు, వయస్సులో తేడాలు ఉన్నట్టుగా గుర్తించారు. ఆ తరువాత హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలో 8లక్షలు చొప్పున, నిజామాబాద్ జిల్లాలో 5.10 లక్షలు నల్గొండ జిల్లాలో 4 లక్షలు మంది ఓటర్ల పేర్లలో తేడాలు ఉన్నాయి.

# ప్రజావాణికి.. అధికారులే కరువు!

**ములకలపల్లి,ఫ్లాష్ ఇండియా :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం ములకలపల్లిలో ఆశించిన స్థాయిలో సాగలేదు. ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారనే సమాచారం పూర్తిస్థాయిలో లేకపోవడంతో కేవలం 18 వినతిపత్రాలు మాత్రమే వచ్చాయి. దీంతో కార్యక్రమంపై అసంతృప్తి వ్యక్తమైంది. ఎంపీడీవో కార్యాలయంలోని ఇరుకు గదిలో ప్రజావాణి నిర్వహించడంపైనా విమర్శలు వెల్లువెత్తాయి.

**బీఆర్ఎస్ నాయకుల అసహనం**

అన్ని శాఖల అధికారులు హాజరు కాకుండా కొద్దిమంది అధికారులు మాత్రమే రావడంతో బీఆర్ఎస్ నాయకులు అసహనం వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు హాజరై ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ప్లకార్డులతో వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'రేవంత్ పోవాలి.. కేసీఆర్ రావాలి', 'కల్యాణలక్ష్మి పథకం ఎక్కడ? తులం బంగారం ఎక్కడ?' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

**కార్యాలయం చుట్టూ తిరగాల్సిందేనా?**

తహసీల్దార్ కార్యాలయంలో ప్రజలకు సేవలు సక్రమంగా అందడం లేదని ఆదివాసీ జిల్లా సంఘం నాయకుడు సున్నం బాబూరావు ఆరోపించారు. చిన్నచిన్న పనుల కోసం కూడా ప్రజలు కార్యాలయం చుట్టూ ఎన్నిసార్లు తిరగాలని ప్రశ్నించారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలతో తహసీల్దార్ దురుసుగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. స్థానికంగా అధికారులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యుడు మల్లికార్జున్ కోరారు. ప్రజల సమస్యలు చెప్పుకునేందుకు ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని అధికారుల పూర్తి హాజరు, విస్తృత ప్రచారం, తగిన వసతులతో నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# సేవా సామ్రాట్ అవార్డుతో మధు గురూజీకి ఘన సత్కారం



**సూర్యాపేట,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** గత 25 సంవత్సరాలుగా జ్ఞాన ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగా, వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు, వృద్ధాశ్రమం, ఆయుర్వేద ప్రచారం, తీర్థయాత్రలు తదితర అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజ సేవలో విశిష్ట సేవలు అందిస్తున్న జ్ఞాన ఫౌండేషన్ వ్యవస్థాపకులు మధు గురూజీకి “సేవా సామ్రాట్” అవార్డు లభించింది. హైదరాబాద్‌కు చెందిన జీవనవాహిని ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మధు గురూజీ సేవలను గుర్తించి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ సత్యసాయి ధ్యానమండలి వ్యవస్థాపకులు, సద్గురువు బిక్షమయ్య గురూజీ హాజరై మధు గురూజీని ఘనంగా సన్మానించి “సేవా సామ్రాట్” అవార్డును అందజేసి అభినందనలు తెలిపారు. గత 25 సంవత్సరాలుగా యోగా, ఆధ్యాత్మికత, వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్యం, వృద్ధుల సంక్షేమం తదితర రంగాల్లో మధు గురూజీ చేస్తున్న సేవలు సమాజానికి స్ఫూర్తిదాయకమని కార్యక్రమంలో పలువురు కొనియాడారు. అనంతరం సేవా సామ్రాట్ అవార్డు గ్రహీత మధు గురూజీ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసిన జీవనవాహిని చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ధనలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు. “సేవ అనేది ఒక కార్యక్రమం మాత్రమే కాదని అది ప్రతి మనిషి బాధ్యత అన్నారు. గత 25 సంవత్సరాలుగా జ్ఞాన ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించే అవకాశం లభించడం నా అదృష్టంగా భావిస్తున్నాని తెలిపారు. నాకు లభించిన ఈ ‘సేవా సామ్రాట్’ అవార్డు వ్యక్తిగత గౌరవంగా కాకుండా, సేవా మార్గంలో నాతో కలిసి నడుస్తున్న ప్రతి ఒక్కరికి దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు ప్రకటించారు. ఈ పురస్కారం నాకు మరింత బాధ్యతను, మరింత స్ఫూర్తిని అందించిందని హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టి, అవసరమైన వారికి అండగా నిలిచి, సమాజానికి మరింతగా ఉపయోగపడేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న శిష్యులు, మిత్రులు, అభిమానులు, దాతలకు పేరు పేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మధు గురూజీకి ఈ అవార్డు లభించడం పట్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన శిష్యులతోపాటు, సూర్యాపేట పట్టణ ప్రజలు, జ్ఞాన ఫౌండేషన్ సభ్యులు, కుటుంబ సభ్యులు, మిత్రులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ మధు గురూజీకి అభినందనలు తెలిపారు.

# పాలిటెక్నిక్ విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడొద్దు




**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మిర్యాలగూడ కమిటీ సమావేశం లో ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మమత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ (వైఐఎస్యు) పేరుతో తీసుకువస్తున్న విధానాల ద్వారా పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులను ఐటిఐ--ఏటీసీ లతో అనుసంధానం చేయడం విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే నిర్ణయమని అన్నారు. పాలిటెక్నిక్ విద్య అనేది ప్రత్యేకమైన సాంకేతిక విద్యా వ్యవస్థ అని,దాని ప్రమాణాలను మరింత పెంచాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా డిప్లమా కోర్సులను ఇతర శిక్షణా కోర్సులతో అనుసంధానం చేయడం కోసం జీవో నెంబర్ 97 ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడకుండా,పాలిటెక్నిక్ విద్యార్థులు మరియు విద్యా నిపుణులతో సమగ్రంగా చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే,పాలిటెక్నిక్ విద్యార్థులను పెద్ద ఎత్తున సమీకరించి భవిష్యత్తులో మరింత బలమైన ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నల్గొండ జిల్లా గర్ల్స్ కన్వీనర్ కావ్య జిల్లా నాయకురాలు లోహి,డివిజన్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జగన్,సైదా నాయక్,వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల అడ్మిషన్ కోసం తల్లి గోడు..

**తిరుమలగిరి,ఫ్లాష్ ఇండియా :** సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన తొలిమండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారుల దృష్టికి తీసుకురాగా, మొత్తం నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో లాజరు వెల్లడించారు. వాటిలో మూడు రెవెన్యూ శాఖకు, ఒకటి విద్యాశాఖకు సంబంధించినవిగా అధికారులు తెలిపారు. నా కొడుకుకు మహాత్మ జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ పాఠశాలలో అడ్మిషన్ ఇప్పించండి సార్ అంటూ ఓ తల్లి విద్యాశాఖ అధికారులను వేడుకోవడం ప్రజావాణిలో భావోద్వేగానికి గురిచేసింది.గురుకులాల ప్రవేశం కోసం తన కుమారుడు కామన్ ఎంట్రెన్స్ పరీక్ష రాసినా ఎక్కడా అడ్మిషన్ సీటు లభించలేదని, తమకు ముగ్గురు పిల్లలు ఉండటంతో ప్రైవేట్ విద్యను భరించే ఆర్థిక స్థోమత లేదని ఆమె వాపోయింది. తన కుమారుడికి చదువు పై ఉన్న ఆసక్తిని చూసి అడ్మిషన్ కోసం కలెక్టర్, ఎమ్మెల్యేలను పలుమార్లు కలిసి వేడుకున్నానని, బీసీ వెల్ఫేర్ కమిషనర్‌కు సైతం అర్జీ పెట్టుకున్నా



ప్రయోజనం లేకపోయిందని తల్లి తన గోడును అధికారుల ఎదుట వెళ్లబోసుకుంది. ఇదిలా ఉండగా, ప్రైవేట్ పాఠశాలల్లో అర్హత లేని ఉపాధ్యాయులతో బోధన చేయిస్తూ, అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ప్రజాసంఘాల ప్రతినిధులు అధికారులకు ఫిర్యాదు చేశారు. కనీస మౌలిక వసతులు లేకుండానే కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు నిర్వహిస్తున్నారంటూ ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణికి వ్యవసాయం, విద్యుత్, వైద్యం, పోలీస్, విద్య, మహిళా శిశు సంక్షేమం, పశువైద్యం, గ్రామీణ నీటిపారుదల తదితర శాఖల మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వినోద్ కుమార్, డీటీ జాన్ మహ్మద్, ఎంపీఓ భీమ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజవాణి లో మొత్తం 10అర్జీలు

**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఈరోజు మండలస్తాయి ప్రజవాణి లొ మొత్తం 10అర్జీలా వరకు వచ్చినాయి ఈ కార్యక్రమములో MPDO మహేష్ నాయక్, MRO మహిపాల్ రెడ్డి, ఇతర ఉద్యోగులు పాలుగోన్నారు.

# చేయూత పింఛన్ దరఖాస్తులకు ఆహ్వానం



**అడవిదేవులపల్లి, ఫ్లాష్ఇండియా ప్రతినిధి :** అడవిదేవులపల్లి గ్రామంలో చేయూత పింఛన్ దరఖాస్తుల అంశంపై గ్రామ సర్పంచ్ కూరాకుల చిన్నరామయ్య ఆధ్వర్యంలో ఉపసర్పంచ్,వార్డు సభ్యులు,గ్రామ పంచాయతీ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు.గ్రామ పంచాయతీ కార్యాలయంలో పింఛన్ దరఖాస్తు ఫారాలను సోమవారం నుంచి అందుబాటులో ఉంచనున్నట్లు సర్పంచ్ తెలిపారు. వితంతువులు,దివ్యాంగులు, ఒంటరి మహిళలు,గీత కార్మికులు,చేనేత కార్మికులు, డయాలసిస్,ఫైలేరియా బాధితులు తదితర అర్హులు ఈనెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# చేవెళ్లలో ఘోర రోడ్డు ప్రమాదం..



**చేవెళ్ల,ఫ్లాష్ ఇండియా :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామ శివారులో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గుడిపూడి హరీష్ (38) మృతి చెందాడు. మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని నార్సింగి, గండిపేట్ పరిధిలోని మై హోమ్ అవతార్‌లో నివాసం ఉంటున్న హరీష్.. చేవెళ్ల మండలంలోని రామన్నగుడికి హ్యుందాయ్ క్రెటా కారులో (TS-07-KH-8586) వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కారును ఏలిపాటి కావ్య (35) నడుపుతుండగా.. హరీష్ ముందు ఎడమవైపు సీటులో కూర్చున్నాడు.కారు వేగంగా, అజాగ్రత్తగా నడపడంతో అదుపుతప్పి రహదారి ఎడమవైపున ఉన్న చెట్టును ఢీకొన్నట్లు మృతుడి తండ్రి గుడిపూడి వెంకటేశ్వరరావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. హరీష్‌కు తల, కాళ్లు, ఛాతీ భాగాల్లో తీవ్ర గాయాలు కావడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. డ్రైవర్ కావ్యకు కూడా తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. ప్రమాదానికి గల కారణాలు, వాహనం వేగం, డ్రైవింగ్ పరిస్థితులపై చేవెళ్ల పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి





**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ప్రజావాణిలో వివిధ సమస్యలతో వచ్చే ప్రజల అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఫిర్యాదులను స్వీకరించి, పరిశీలించారు. ఈ సందర్భంగా (259) అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు కేటాయిస్తూ, ప్రజా సమస్యలపై తగిన చర్యలు తీసుకొని, త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు.ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని, పెండింగ్‌లో లేకుండా దరఖాస్తులను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని ఆదేశించారు. ఈరోజు ప్రజావాణికి వచ్చిన కొన్నింటి దరఖాస్తుల వివరాలిలా ఉన్నాయిజిల్లా కేంద్రంలోని ప్రగతి నగర్ కు చెందిన నల్ల సుజాత, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఆర్థిక సహాయం కొరకు మనవి చేస్తూ దరఖాస్తు చేసుకున్నారు.ఇటిక్యాలపల్లి గ్రామం, బచ్చన్నపేట మండలానికి చెందిన సుంకె రాములమ్మ, తన పది గుంటల భూమికి సర్వే నిర్ణయించి, హద్దు రాళ్లు పాతించారని, కానీ తన భూమి పక్కన ఉన్న వారు వాటిని తీసేయడం జరిగిందని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసియున్నారు. పెద్దమడ్గూర్ గ్రామం, దేవరుప్పుల మండలానికి చెందిన గనుపాక సునీత, తాను నిరుపేద కుటుంబానికి చెందినదని, ఈ మేరకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించగలరని ప్రార్థిస్తూ ఆర్జీ ద్వారా కోరారు. పాలకుర్తి గ్రామం, పాలకుర్తి మండలానికి చెందిన మామిండ్ల రాణి, తాము పేదవారమని, రేషన్ కార్డులో వచ్చే బియ్యం మాత్రమే తమకు ఆధారమని, కావున రేషన్ కార్డులో తమ పేర్లను యాడ్ చేయగలరని, రేషన్ కార్డు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించనైనది.మీదికొండ గ్రామం, ఘనపూర్ (స్టేషన్) మండలానికి చెందిన గాదెర ఎల్లయ్య, తాము నిరుపేద కుటుంబం అని, రోజూ వారి కూలి పని చేసుకుంటామని, పంట రుణం మాఫీ కాలేదని, ఈ మేరకు పంట రుణం మాఫీ చేయుట కోసం దరఖాస్తును సమర్పించినారు.ఈ ప్రజావాణిలో డీఆర్డీఓ భాస్కర్, సీపీఓ చిన కోట్యా నాయక్, గృహ నిర్మాణ శాఖ పీడీ మాతృ నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన జీవితం మన లక్ష్యం కావాలి




**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మత్తు పదార్థాలకు,మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవితం జీవించడం మనందరి లక్ష్యం కావాలని మిర్యాలగూడ లోని కె.ఎన్.ఎమ్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు భీమార్జున రెడ్డి విద్యార్థులకు సూచించారు.“నషా ముక్త్ అభియాన్”లో భాగంగా కళాశాలలోని ఎన్.ఎస్.ఎస్.విభాగం మరియు పట్టణంలోని బ్రహ్మకుమారి సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదకద్రవ్యాలు సేవించడం వల్ల ఎదురయ్యే ప్రమాదాల పై యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమానికి వారు అధ్యక్షత వహించి మాట్లాడుతూ సిగరెట్,గుట్కా,డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగం మొదట సరదాగా లేదా స్నేహితుల ఒత్తిడితో ప్రారంభమైనప్పటికీ,క్రమంగా అది వ్యసనంగా మారి వ్యక్తి జీవితాన్ని నాశనం చేస్తుందని, ఆరోగ్యం దెబ్బతినడం,విద్యలో వెనుకబడటం, కుటుంబ సంబంధాలు చెడిపోవడం,ఆర్థిక సమస్యలు తద్వారా నేరాలకు దారితీయడం వంటి అనేక ప్రతికూల పరిణామాలు ఎదురవుతాయని హెచ్చరించారు.యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, వారి శక్తి, ప్రతిభ, ఆలోచనా సామర్థ్యం దేశాభివృద్ధికి వినియోగించాలని సూచించారు.మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండేందుకు క్రీడలు,యోగా, పఠనం,సృజనాత్మక కార్యక్రమాలు,మంచి స్నేహితుల సహవాసం ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.అనంతరం విద్యార్థులచే మత్తుపదార్థాలను ఉపయోగించబోమని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్.నిర్వాహకులు ఎస్.శ్రీనివాసరావు,ఆర్.స్వప్న బ్రహ్మకుమారి సంస్థ నిర్వాహకులు స్పందన, వెంకటేశ్వర్లు,భవాని,మాధవి, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ముసాయిదా ఓటరు జాబితా విడుదల..

**సత్తుపల్లి,ఫ్లాష్ ఇండియా :** ముసాయిదా ఓటరు జాబితాను సోమవారం విడుదల చేశామని, క్లైయిమ్‌లు, అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 16లోగా సమర్పించాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ ప్రక్రియ, ముసాయిదా ఓటర్ల జాబితాపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముసాయిదా జాబితా, అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లు, క్లైయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కార ప్రక్రియపై వివరించారు.భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 17న ఎస్ఐఆర్ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 10,85,927 మంది ఓటర్లతో ముసాయిదా జాబితా విడుదలైందన్నారు. ఇందులో 5,24,894 మంది పురుషులు, 5,60,973 మంది మహిళలు, 60 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు.ముసాయిదా జాబితాలో 1,33,004 మంది (12.24 శాతం) ఓటర్లను అనామలీస్‌గా, 43,131 మంది (3.97 శాతం) ఓటర్లను మ్యాపింగ్ కానివారిగా గుర్తించినట్లు చెప్పారు. మొత్తం 1,76,135 మంది ఓటర్లకు ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారుల ద్వారా నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న వారు సంబంధిత పత్రాలను సమర్పించాలని కలెక్టర్ సూచించారు. పుట్టిన తేదీ ఆధారంగా భారత ఎన్నికల సంఘం సూచించిన పత్రాలను సమర్పించాలన్నారు. ఆగస్టు 17న ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని సూచించారు. పేరు లేకపోతే బూత్ స్థాయి అధికారి, సహాయ ఎన్నికల నమోదు అధికారి లేదా ఎన్నికల నమోదు అధికారిని సంప్రదించాలన్నారు. ceotelangana.nic.in వెబ్‌సైట్ ద్వారా కూడా ఓటరు జాబితాలో పేరు పరిశీలించుకోవచ్చని తెలిపారు.ముసాయిదా జాబితాలో పేరు లేకపోయినా, వివరాల్లో అభ్యంతరాలు ఉన్నా సెప్టెంబర్ 16, 2026లోగా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించవచ్చన్నారు. అర్హత కలిగిన కొత్త ఓటర్లు ఫారమ్-6 ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు, ఏ శాసనసభ నియోజకవర్గంలోనూ ఓటరుగా నమోదు కాకపోతే ఫారమ్-6 ద్వారా తాజా ఫొటో, వయస్సు ధ్రువీకరణ పత్రం, డిక్లరేషన్ తదితరాలను జతచేసి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. చనిపోయిన లేదా డూప్లికేట్ ఓటర్లపై అభ్యంతరాలు తెలియజేయడానికి ఫారమ్-7, మొబైల్ నంబర్ నవీకరణ, చిరునామా మార్పు, ఓటరు గుర్తింపు కార్డులో వివరాల సవరణలకు ఫారమ్-8 వినియోగించుకోవచ్చని వివరించారు. ఎస్ఐఆర్ ముసాయిదా ఓటర్ల జాబితాపై ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. వాటిపై నోటీసుల జారీ, పరిష్కార ప్రక్రియ ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు కొనసాగుతుందని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అక్టోబర్ 19, 2026న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు కలెక్టర్



తెలిపారు.రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పరిధిలోని ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావడంతో పాటు తమ వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించుకునేలా సహకరించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం బూత్ స్థాయి అధికారి, సహాయ ఎన్నికల నమోదు అధికారి, ఎన్నికల నమోదు అధికారులను సంప్రదించవచ్చని, అలాగే టోల్‌ఫ్రీ 1950కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్‌డీసీ సదానందం, ఆర్డీఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డీటీ అన్సారీతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# భారత్ స్పిన్ ఉచ్చులో పడ్డ శ్రీలంక బ్యాటర్స్..

గాలే వేదికగా భారత్, శ్రీలంక మధ్య జరుగుతున్న తొలి టెస్టులో ఆతిథ్య జట్టు కష్టాల్లో పడింది. భారత స్పిన్నర్ల ధాటికి శ్రీలంక బ్యాటర్లు వరుసగా పెవిలియన్‌కు చేరుతున్నారు. మూడో రోజు తొలి సెషన్ లంచ్ సమయానికి శ్రీలంక 28 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 99 పరుగులు చేసింది. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో భారత్ కంటే ఇంకా 363 పరుగులు వెనుకబడి ఉంది. అంతకుముందు భారత్ తన తొలి ఇన్నింగ్స్‌ను 462 పరుగుల వద్ద ముగించింది. దేవదత్ పడిక్కల్ అద్భుతమైన 167 పరుగులతో భారీ శతకం సాధించగా.. కేఎల్ రాహుల్ 82, ధ్రువ్ జురెల్ 51, రిషభ్ పంత్ 39, యశస్వి జైస్వాల్ 32 పరుగులతో రాణించారు. దీంతో భారత్ భారీ స్కోరు నమోదు చేసింది. భారత్ బౌలింగ్‌లో రెండు వికెట్లు పడగొట్టగా, కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా, మహ్మద్ సిరాజ్ చెరో వికెట్ తీశారు. ముఖ్యంగా సుతార్, కుల్దీప్, జడేజా స్పిన్‌ను ఎదుర్కోవడంలో శ్రీలంక బ్యాటర్లు ఇబ్బంది పడ్డారు. శ్రీలంక ఇన్నింగ్స్ ప్రారంభంలోనే నిషాన్ మదుష్క ఫెర్నాండోను మహ్మద్ సిరాజ్ డకౌట్ చేశాడు. ఆ తర్వాత లహిరు ఉదర 27 పరుగులు, దినేశ్ చండిమాల్ 4 పరుగులు చేసి సుతార్ బౌలింగ్‌లో ఔటయ్యారు. కమిందు మెండిస్ 14 పరుగుల వద్ద కుల్దీప్ యాదవ్‌కు వికెట్ సమర్పించుకున్నాడు. ఆ తర్వాత కెప్టెన్ ధనంజయ డి సిల్వా 21 పరుగులు చేసి జడేజా బౌలింగ్‌లో కేఎల్ రాహుల్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. దీంతో శ్రీలంక 90 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. లంచ్ సమయానికి సోనల్ దినుష 14, నిరోషన్ డిక్వెల్లా 8 పరుగులతో క్రీజులో ఉన్నారు. శ్రీలంకకు ఇంకా 5 వికెట్లు చేతిలో ఉన్నప్పటికీ.. భారత్ భారీ ఆధిక్యంలో ఉండటంతో మ్యాచ్‌పై టీమిండియా పూర్తి ఆధిపత్యం కొనసాగిస్తోంది.

# చిత్తుగా ఓడిన నెంబర్‌వన్ టెస్ట్ టీమ్ ఆస్ట్రేలియా



ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న బంగ్లాదేశ్ జట్టు సరికొత్త చరిత్రను సృష్టించింది. డార్విన్‌లోని మారారా స్టేడియంలో జరిగిన మొదటి టెస్ట్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా వారి స్వదేశంలోనే 9 వికెట్ల తేడాతో ఓడించి సంచలన విజయం నమోదు చేసింది. అయితే, తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకే ఆలౌటైంది. స్టీవ్ స్మిత్ 71 పరుగులతో రాణించగా, బంగ్లాదేశ్ పేసర్ హసన్ మహమూద్ 55 పరుగులిచ్చి ఏకంగా 6 వికెట్లు తీసుకుని ఆసీస్ బ్యాటింగ్ లైన్‌అప్‌ను దెబ్బతీశాడు.

**తంజీద్ హసన్ సెంచరీ..**


అనంతరం ఫస్ట్ ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్ బ్యాటర్లు అద్భుత ప్రదర్శన చేశారు. ఓపెనర్ తంజీద్ హసన్ (101) సెంచరీ సాధించి, ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సెంచరీ చేసిన తొలి బంగ్లాదేశ్ బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు.

కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ శాంతో (84), మెహిదీ హసన్ మిరాజ్ (65) రాణించడంతో బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 426 పరుగుల భారీ స్కోరు సాధించి, 228 పరుగుల భారీ ఆధిక్యాన్ని అందుకోగలిగింది. ఆసీస్ బౌలర్లలో జోష్ హేజిల్‌వుడ్ 6 వికెట్లు పడగొట్టాడు. ఇక 228 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా 284 పరుగులకు ఆలౌటైంది. కెమరూన్ గ్రీన్ (104) సెంచరీతో ఒంటరి పోరాటం చేసినప్పటికీ, మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు. బంగ్లాదేశ్ ఆఫ్ స్పిన్నర్ మెహిదీ హసన్ మిరాజ్ 66 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి ఆస్ట్రేలియాను తక్కువ పరుగులకే పరిమితం చేశాడు.

**ఈజీ టార్గెట్.. సునాయాస విజయం**

ఆసిస్ నిర్దేశించిన 57 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని బంగ్లాదేశ్ కేవలం 1 వికెట్ మాత్రమే కోల్పోయి 14.2 ఓవర్లలోనే ఛేదించింది. మోమినుల్ హక్ 30, షాద్‌మాన్ ఇస్లామ్ 25 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చారు. ఈ విజయంతో రెండు టెస్టుల సిరీస్‌లో బంగ్లాదేశ్ 1-0 ఆధిక్యంలో నిలిచింది.


# ఆ వివరాలు బహిర్గతం చేయాలి



ఐపీఎల్ ట్రేడింగ్ వ్యవస్థపై టీమిండియా మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ట్రేడింగ్ వ్యవస్థలో పారదర్శకత కొరవడిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఐపీఎల్‌లో ఫ్రాంచైజీల మధ్య జరిగే ఆటగాళ్ల బదిలీలు, వాటికి సంబంధించిన ఆర్థిక లావాదేవీల వివరాలను బహిర్గతం చేయాలని ఆయన బీసీసీఐని కోరారు. తన 'మిడ్-డే' కాలమ్‌లో గావస్కర్ ఈ అంశంపై బీసీసీఐకి స్పష్టమైన విజ్ఞప్తి చేశారు. ఐపీఎల్‌లో సాధారణంగా జరిగే వేలం పద్ధతికి భిన్నంగా ఆఫ్‌సీజన్‌లో ఫ్రాంచైజీలు నేరుగా ఆటగాళ్లను ట్రేడ్ చేసుకుంటుంటాయి. అయితే, ఈ ప్రక్రియలో ఆటగాడిని కొనుగోలు చేసిన ధర లేదా ఆర్థిక వివరాలు కేవలం సంబంధిత రెండు ఫ్రాంచైజీలు, ఆటగాడికి, అలానే బీసీసీఐకి మాత్రమే తెలుస్తున్నాయని గావస్కర్ గుర్తుచేశారు. దీనివల్ల మిగతా జట్లకు ఆ సమాచారం తెలియక, అవి నిర్దేశిత వేతన నిబంధనలను పాటిస్తున్నాయా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆయన పేర్కొన్నారు.'ఒక ఫ్రాంచైజీ నుంచి మరొకదానికి ఆటగాడి మార్పిడి బహిరంగంగానే జరుగుతున్నప్పటికీ, ట్రేడింగ్ జరిగేటప్పుడు వెచ్చించిన మొత్తం మాత్రం గోప్యంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో ఇతర జట్లకు కూడా ఆ ట్రేడింగ్ తెలియాల్సిన అవసరం ఉంది. అప్పుడే ఆటగాళ్ల జీతాల పరిమితి నిబంధనలను అందరూ సరిగ్గా పాటిస్తున్నారనే స్పష్టత వస్తుంది. కాబట్టి బీసీసీఐ ఈ విషయంలో పూర్తి పారదర్శకత పాటించి, ట్రేడింగ్ మొత్తాలను ప్రేక్షకులకు, ఇతర ఫ్రాంచైజీలకు అందుబాటులో ఉంచాలి' అని గావస్కర్ స్పష్టం చేశారు.

# బిజినెస్

## స్మార్ట్‌ఫోన్ తయారీలోకి ఆంబర్ ఎంటర్‌ప్రైజెస్





దేశీయ ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో బలమైన ముద్ర వేస్తున్న ఆంబర్ ఎంటర్‌ప్రైజెస్, ఇప్పుడు వేగంగా అభివృద్ధి చెందుతున్న స్మార్ట్‌ఫోన్ మ్యానుఫ్యాక్చరింగ్ మార్కెట్‌లోకి అడుగుపెడుతోంది. ప్రముఖ చైనా బ్రాండ్లు ఒప్పో, వన్‌ప్లస్, రియల్‌మీ స్మార్ట్‌ఫోన్లను తయారు చేయడానికి ఒప్పో మొబైల్స్ ఇండియాతో ఆంబర్ ఒక ప్రత్యేక తయారీ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సహకారంలో భాగంగా 2027, మార్చి త్రైమాసికంలో ట్రయల్ ప్రొడక్షన్ ప్రారంభించి, 2027-28 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం నాటికి పూర్తి స్థాయి కమర్షియల్ ఉత్పత్తిని మొదలుపెట్టాలని కంపెనీ లక్ష్యంగా ఉంది. కార్యకలాపాలు ప్రారంభించిన మొదటి సంవత్సరంలో సుమారు 80 లక్షల స్మార్ట్‌ఫోన్లను, రెండో సంవత్సరంలో ఆ సంఖ్యను 1.5-1.6 కోట్ల యూనిట్లకు రెట్టింపు చేయాలని ఆంబర్ వెల్లడించింది. ఈ కొత్త విభాగం కోసం ప్రత్యేకంగా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌ను కూడా నియమించి, ఉత్పాదకతను దశలవారీగా పెంచనున్నట్టు కంపెనీ పేర్కొంది. భారత మార్కెట్‌లో వివో, ఒప్పో గ్రూప్ బ్రాండ్లు బలమైన వాటాను కలిగి ఉన్నప్పటికీ, రెగ్యులేటరీ, పన్నుపరమైన సవాళ్ల కారణంగా ఇవి స్థానిక తయారీ భాగస్వాముల (అసెట్-లైట్ మోడల్) పై ఎక్కువగా ఆధారపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆంబర్ ఎంట్రీ ఆ బ్రాండ్లకు పెద్ద ఊతమివ్వనుంది. అయితే, రాగి ధరలు భారీగా పెరగడంతో తమ బేర్ ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్ (పీసీబీ) వ్యాపారంలో మార్జిన్లపై కొంత ఒత్తిడి పడుతున్నట్లు ఆంబర్ తెలిపింది. ఈ వ్యయ భారాన్ని క్రమంగా వినియోగదారులకు మళ్లిస్తున్నామని, భవిష్యత్‌లో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా 2029-30 నాటికి సొంతంగా సీసీఎల్ తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది.




# సోలార్, బ్యాటరీ స్టోరేజ్ రంగాల్లోకి సుజ్లాన్ ఎనర్జీ ఎంట్రీ

ప్రముఖ విండ్ టర్బైన్ తయారీ సంస్థ సుజ్లాన్ ఎనర్జీ, తన సాంప్రదాయ వ్యాపార శైలికి స్వస్తి పలుకుతూ పూర్తిస్థాయిలో పునరుత్పాదక ఇంధన విభాగంలోకి మారేందుకు 'సుజ్లాన్ 2.0' వ్యూహాన్ని ప్రకటించింది. మార్కెట్‌లో నిరంతరాయమైన, నమ్మకమైన క్లీన్ ఎనర్జీకి పెరుగుతున్న డిమాండ్‌ను అందుకోవడానికి సుజ్లాన్ ఎనర్జీ తన వ్యాపారాన్ని ఆర్‌ఈ టెక్, ఆర్‌ఈ డెవ్‌కో, ఆర్‌ఈ ప్రాజెక్ట్స్, ఆర్‌ఈ అసెట్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (ఏఎంఎస్) నాలుగు ప్రధాన విభాగాలుగా పునర్వ్యవస్థీకరించింది. ఇకపై కేవలం టర్బైన్ల తయారీకే పరిమితం కాకుండా పవన, సౌర, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వ్యవస్థలను (బీఈఎస్ఎస్) అనుసంధానిస్తూ 'హైబ్రిడ్', 'ఫర్మ్ అండ్ డిస్పాచబుల్ రిన్యూవబుల్ ఎనర్జీ' (ఎఫ్‌డీఆర్‌ఈ) ప్రాజెక్టులను చేపట్టనుంది. భూసేకరణ, గ్రిడ్ అనుమతులు సాధించడం నుండి ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణ వరకు అన్ని సేవలను ఒకే చోట అందించడం ద్వారా ఆస్తులపై తక్కువ భారం వేస్తూ లాభదాయకతను పెంచుకోవడమే కంపెనీ ప్రధాన లక్ష్యమని సీఈఓ అజయ్ కపూర్ తెలిపారు. మరోవైపు, 2030 నాటికి దేశ సౌర విద్యుత్ కాకుండా ఇతర విభాగాల్లో గరిష్ట డిమాండ్‌ను తీర్చడానికి 130 గిగావాట్ కంటే ఎక్కువ పవన విద్యుత్ సామర్థ్యం అవసరమవుతుందని సుజ్లాన్ అంచనా వేస్తోంది. ఈ క్రమంలో భూసేకరణ, గ్రిడ్ కనెక్టివిటీ వంటి మౌలిక సవాళ్లను తమ 'ఆర్‌ఈ డెవలప్‌మెంత్ కంపెనీ' విభాగం ద్వారా ముందస్తుగానే పరిష్కరించి, సిద్ధంగా ఉన్న ప్రాజెక్టులను డెవలపర్లకు అందించాలని కంపెనీ భావిస్తోంది. దీంతో పాటు, తమ కార్యకలాపాలు, నిర్వహణ (ఓఅండ్ఎం) విభాగాన్ని డిజిటల్-ఫస్ట్ ప్లాట్‌ఫారమ్‌గా మార్చడం ద్వారా స్మార్ట్ మ్యానుఫ్యాక్చరింగ్‌ను అభివృద్ధి చేయనున్నట్టు కంపెనీ వెల్లడించింది.

# బంగారు ఆభరణాలకు 'సోల్డ్' ట్యాగ్



దేశీయ బంగారు ఆభరణాల విపణిలో పారదర్శకతను పెంచేందుకు, అక్రమ విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం విప్లవాత్మక డిజిటల్ ట్రాకింగ్ విధానానికి శ్రీకారం చుడుతోంది. ప్రస్తుతం అమలులో ఉన్న ఆరు అంకెల ఆల్ఫాన్యూమరిక్ హెచ్‌యూఐడీ(హాల్‌మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్) వ్యవస్థకు ప్రభుత్వం మరింత పదను పెడుతోంది. ప్రతిపాదిత విధానం ప్రకారం, ఒక ఆభరణం అమ్ముడవగానే దాని హెచ్‌యూఐడీ కోడ్‌కు 'అమ్మబడింది' (సోల్డ్) అనే హోదాను కేటాయిస్తారు. భవిష్యత్తులో ఆ నంబర్‌ను వేరే నగలపై దుర్వినియోగం చేసినా లేదా దొంగిలించిన నగలని రిటైలర్లకు అమ్మడానికి తెచ్చినా, సిస్టమ్ వెంటనే హెచ్చరికలు పంపుతుంది. పాత బంగారం కొనుగోలు చేసేటప్పుడు ఆభరణం పూర్తి వివరాలు, లావాదేవీల హిస్టరీ స్పష్టంగా కనిపిస్తాయి. దీనివల్ల వినియోగదారుల రక్షణ పెరగడంతో పాటు, బీఐఎస్ చట్టం-2016 నిబంధనల ప్రకారం హాల్‌మార్క్ దుర్వినియోగానికి పాల్పడే వారిపై రూ. 1 లక్ష వరకు జరిమానా, జైలు శిక్ష, వ్యాపార రిజిస్ట్రేషన్ రద్దు వంటి కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

**గోల్డ్ మార్కెట్ పరిమాణం, డిజిటల్ సవాళ్లు**

2026, జనవరి నాటికి భారత రత్నాలు, ఆభరణాల మార్కెట్ విలువ సుమారు 85 బిలియన్ డాలర్లు(రూ. 8.11 లక్షల కోట్లు)గా నమోదు కాగా, 2030 నాటికి ఇది 130 బిలియన్ డాలర్ల(రూ. 12.41 లక్షల కోట్ల)కు చేరుకుంటుందని అంచనా. అయితే, ఇందులో వ్యవస్థీకృత నగల వ్యాపారుల వాటా కేవలం 16 శాతం మాత్రమే కాగా, మిగిలిన 84 శాతం అసంఘటిత రంగంలోనే ఉంది. దేశంలో ఇప్పటికే 58 కోట్లకు పైగా ఆభరణాలకు హెచ్‌యూఐడీ కేటాయించినప్పటికీ, అత్యధికంగా ఉన్న చిన్న వ్యాపారులలో ఈ కొత్త డిజిటల్ విధానాన్ని పటిష్టంగా అమలు చేయడం ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారనుంది. అందువల్ల, ఈ నూతన వ్యవస్థను ముందుగా పట్టణ ప్రాంతాల్లోని పెద్ద రిటైలర్లలో ప్రారంభించి, ఆ తర్వాత దశలవారీగా గ్రామీణ, చిన్న వ్యాపారులకు విస్తరించాలని యోచిస్తున్నారు.

**నగల వ్యాపారుల ఆందోళన, ఏఐ పరిష్కారాలు**

పరిశ్రమ వర్గాలు ఈ నిర్ణయాన్ని సూత్రప్రాయంగా స్వాగతించినప్పటికీ, కొన్ని ఆచరణాత్మక ఇబ్బందులను లేవనెత్తుతున్నాయి. వినియోగదారులు ఆభరణాలలో మార్పులు (రీ-మోడలింగ్) చేసుకున్నప్పుడు బరువు మారడం, ప్రతి వస్తువుకు ప్రత్యేక ఇన్వెంటరీ రికార్డులను నిర్వహించడం వల్ల నిర్వహణ ఖర్చులు పెరుగుతాయని జ్యువెలర్లు భావిస్తున్నారు. అయితే, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఆటోమేటెడ్ సాఫ్ట్‌వేర్‌లను బిల్లింగ్ సిస్టమ్‌తో లింక్ చేయడం ద్వారా ఈ ప్రక్రియను సులభతరం చేయవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఈ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తే బంగారం శుద్ధి స్థాయి నుండి రిటైల్ అమ్మకాల వరకు పూర్తి పారదర్శకత పెరుగుతుంది.




# మా బంధం వెలకట్టలేనిది

టాలీవుడ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ గత కొద్ది రోజుల నుంచి నిత్యం వార్తల్లోనిలుస్తున్నారు. తన పర్సనల్ లైఫ్ గురించి చేసిన విషయాలు ఇప్పుడు బాగా వైరల్ అవుతున్నాయి. గతంలో ఒకరితో ప్రేమలో ఉన్నప్పుడు తాను పడిన మానసిక బాధలను ఆమె ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. ఎప్పుడూ తమ మాట మాత్రమే వినాలి అని అనుకునే వ్యక్తితో ఉండటం ఎంత నరకమో చెప్తూ ఆమె కన్నీళ్లు పెట్టుకున్న విషయం తెలిసిందే. ఆ మాజీ ప్రియుడి వల్ల తన సొంత కుటుంబానికి, స్నేహితులకు కూడా దూరం కావాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా, తన కష్టకాలంలో ఓ ఇద్దరు హీరోలే తనకు అండగా నిలిచారని తెలుపుతూ ఆసక్తికర కామెంట్స్ చేశారు. దుల్కర్ సల్మాన్ గురించి చెప్తూ, తనకు మనశ్శాంతి లేనప్పుడు లేదా కష్టాల్లో ఉన్నప్పుడు మొదట గుర్తుకువచ్చేది ఆయనేనని పేర్కొన్నారు.తాను ఏదైనా మానసిక బాధలో ఉంటే ఆయనకు ఎలా తెలుస్తుందో అర్థం కాదని, తాను డిప్రెషన్‌లో ఉన్నప్పుడల్లా ఆయన నుంచి ఒక మెసేజ్ కచ్చితంగా వస్తుందని వెల్లడించారు. దుల్కర్‌తో కొద్దిసేపు మాట్లాడితే తన మానసిక భారం మొత్తం తేలికైపోతుందని, బాధ అంతా మాయమైపోతుందని చెప్పారు. దుల్కర్ తర్వాత తాను పూర్తిస్థాయిలో విశ్వసించే మరొక మంచి స్నేహితుడు హీరో రామ్ పోతినేని అని అనుపమ తెలిపారు. సినిమా పరిశ్రమలో ఈ ఇద్దరితో ఉన్న బాండింగ్ తనకు ఎంతో ప్రత్యేకమైనదని, వెలకట్టలేనిదని పేర్కొన్నారు. గతంలో అనుపమ, దుల్కర్ కలిసి మలయాళంలో 'జోమోన్స్ సువిశేషంగళ్' చిత్రంలో నటించిన సంగతి తెలిసిందే. ఇక రామ్ పోతినేని అనుపమ విషయానికొస్తే.. వీరిద్దరు 'ఉన్నది ఒక్కటే జిందగీ, హలో గురూ ప్రేమకోసమే వంటి చిత్రాల్లో జంటగా నటించి మెప్పించారు.




# 'డీసీ' కి సూపర్ స్టార్ ఫిదా..

కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ హీరోగా మారి నటించిన సరికొత్త చిత్రం 'డీసీ' . విలక్షణ దర్శకుడు అరుణ్ మాథే శ్వరన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో బాలీవుడ్ భామ వామికా గబ్బి హీరోయిన్‌గా నటించింది. అయితే ఆగస్ట్ 7న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద విజయాన్ని సాధిస్తూ, థియేటర్లలో దూసుకుపోతోంది. అరుణ్ మాథేశ్వరన్ మేకింగ్ స్టైల్, రా అండ్ రస్టిక్ టేకింగ్‌కు యంగ్ మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ రవిచందర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ తోడవ్వడంతో ఈ సినిమాకు సినీ ప్రముఖుల నుంచి విశేష ప్రశంసలు అందుతున్నాయి. తాజాగా ఈ చిత్రాన్ని చూసిన సూపర్ స్టార్ మహేష్ బాబు 'డీసీ' చిత్రంపై ప్రశంసల జల్లు కురిపించారు.సోషల్ మీడియా వేదికగా ఆయన స్పందిస్తూ.. "'డీసీ' చాలా ఒరిజినల్ అండ్ అవుట్‌స్టాండింగ్ సినిమా. సినిమా చూస్తున్నంత సేపు చాలా కూల్‌గా అనిపించింది. ప్రతీ సీన్‌నూ ఎంతగానో ఆస్వాదించాను. దర్శకుడు, నటీనటులు, చిత్ర యూనిట్ అందరికీ నా హృదయపూర్వక అభినందనలు" అని ట్వీట్ చేశారు. ప్రస్తుతం మహేష్ బాబు చేసిన ఈ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. సూపర్ స్టార్ నుంచి ఇలాంటి అద్భుతమైన రెస్పాన్స్ రావడంతో సంగీత దర్శకుడు అనిరుధ్ ఆయనకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. దర్శకుడిగానే కాకుండా నటుడిగానూ లోకేష్ కనకరాజ్ సరికొత్త అవతారంలో మెప్పించడంతో ఈ సినిమా ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది.

# చిన్నారిని అలా అనడంతో నెటిజన్ల ట్రోల్స్



రవితేజ, శివ నిర్వాణ కలయికలో తెరకెక్కిన విభిన్నమైన చిత్రం 'ఇరుముడి'. ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ మ్యూజిక్ అందించారు. ఇందులో బేబీ నక్షత్ర, సాయి కుమార్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. షూటింగ్ పూర్తి చేసుకుని ఈ నెల ఆగస్ట్ 21న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో మేకర్స్ వైభవంగా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఇక ఈ వేడుకల్లో పాల్గొన్న రవితేజ ఆసక్తికర కామెంట్స్ చేశారు. "ఈ సినిమా తమ్ముళ్లకు తెగ నచ్చేస్తుంది, మళ్లీ పాత రవన్నను చూడబోతున్నారు" అని చెప్పారు. అయితే ఇదే వేదికపై జరిగిన ఒక సంఘటన ఇప్పుడు పెద్ద వివాదానికి దారితీసింది. కార్యక్రమంలో భాగంగా సినిమాలో తన కూతురిగా నటించిన చైల్డ్ ఆర్టిస్ట్ బేబీ నక్షత్ర రవితేజను ఒక ముద్దుపేరు పెట్టమని కోరింది.దానికి రవితేజ కాసేపు ఆలోచించి ముదురు ముంఠ అనడంతో అక్కడున్న వారంతా నవ్వారు. ఆ మాటకు అర్థం తెలియక ఆ చిన్నారి అమాయకంగా ప్రశ్నించగా, తర్వాత చెబుతానని రవితేజ అన్నారు. ఇక ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కావడంతో నెటిజన్లు రవితేజ తీరును తీవ్రంగా తప్పుబడుతున్నారు. బహిరంగ వేదికపై ఒక చిన్నారితో మాట్లాడేటప్పుడు కనీస విచక్షణ, బాధ్యత ఉండక్కర్లేదా అని ప్రశ్నిస్తున్నారు. సరదా మాటలకు, హద్దులు దాటే అనుచిత పదాలకు తేడా గుర్తుంచుకోవాలనిహెచ్చరిస్తున్నారు. 'ఇరుముడి' లాంటి భక్తి నేపథ్యం ఉన్న చిత్ర వేదికపై ఇలాంటి పదాలు అనడం ఏమాత్రం తగవని మండిపడుతున్నారు. కాగా, ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో ఆ పదాన్ని కేవలం సరదాగా మాత్రమే వాడతారని కొందరు నెటిజన్లు రవితేజకు మద్దతు తెలపడం గమనార్హం.

# ఆ విషయంలో అందరికంటే ముందు

కోలీవుడ్ ఇండస్ట్రీలో రజనీకాంత్ తర్వాత అదే స్థాయిలో స్టార్‌డమ్‌ను సంపాదించుకున్న వారిలో తలపతి విజయ్ ఒకరు. ఇక సూపర్‌స్టార్ రజనీకాంత్ వయసు పెరగడంతో ఆయన సినిమాల సంఖ్య చాలావరకు తగ్గింది. అదే సమయంలో విజయ్ ప్రస్తుతం తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉండడంతో ఆయన కూడా సినిమాలకు దూరంగా ఉండబోతున్నారు. దీంతో కోలీవుడ్ ఇండస్ట్రీలో నెక్స్ట్ స్టార్ హీరో ఎవరు అనే దానిపై ఆసక్తి నెలకొంది. విజయ్ కంటే ముందే కోలీవుడ్‌లో అద్భుతమైన క్రేజ్‌ను సంపాదించుకున్న వారిలో అజిత్ కుమార్ ఒకరు. కాకపోతే ఈయన కమర్షియల్ సినిమాల కంటే ప్రయోగాత్మకమైన చిత్రాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంతో ఈ మధ్యకాలంలో సరైన విజయాలు దక్కడం లేదు.అలాగే ఆయన సినిమాల కంటే కార్ రేసింగ్‌పైనే ఎక్కువ దృష్టి పెడుతూ వస్తున్నారు.



ఇక ఇంతకాలం పాటు సూర్య వరుస అపజయాలతో డీలా పడిపోయాడు. కానీ వరుసగా 'వీరభద్రుడు', 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రాలతో భారీ విజయాలను అందుకున్నాడు. అలాగే ఈయనకు తమిళంతో పాటు తెలుగులోనూ మంచి క్రేజ్ ఉంది. ఇలా విజయ్ రాజకీయాల్లో బిజీ అయిన సమయంలోనే సూర్యకు వరుసగా బ్లాక్‌బస్టర్స్ దక్కుతుండడంతో కోలీవుడ్ ఇండస్ట్రీలో విజయ్ తర్వాతి స్థానం సూర్యదే అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ఫ్యాక్టరీలో తయారైన ప్లాస్టిక్ బొమ్మను కాను..



సయామీ ఖేర్ బాలీవుడ్‌లో ఉండే కండీషన్ల గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. బాలీవుడ్‌లో నటీమణులు ఎలా కనిపించాలి, ఎలాంటి దుస్తులు ధరించాలనే విషయాలపై ఉండే ఒత్తిడి గురించి ఓపెన్‌గా మాట్లాడారు.తన కెరీర్ ప్రారంభంలో చాలామంది నిర్మాతలు తనకు రకరకాల సలహాలు ఇచ్చారని తెలిపారు. ఇండస్ట్రీలో ఎక్కువ కాలం నిలదొక్కుకోవాలంటే ఒక పద్ధతి ప్రకారం మాత్రమే కనిపించాలని, అందరిలాగే డ్రెస్సింగ్ స్టైల్ మార్చుకోవాలని తనపై ఒత్తిడి తెచ్చారని చెప్పారు. చివరకు తన సహజమైన ఉంగరాల జుట్టును కూడా తీసివేయమని చాలామంది చెప్పారని ఆమె వెల్లడించారు. అయితే అందరి మాటలు విని అలా మారిపోతే ఒక ఫ్యాక్టరీలో తయారైన బార్బీ బొమ్మలా మారిపోతానని భావించి, తన ఒరిజినాలిటీని కోల్పోవడానికి నిరాకరించానని తెలిపారు. ఇండస్ట్రీ నిబంధనలకు లొంగకుండా తనకు ఇష్టమైన క్రీడలపై దృష్టి పెడుతూ, స్వేచ్ఛగా విషయాలు మాట్లాడుతుంటూ తనలాగే ఉన్నానని చెప్పారు. తన తల్లిదండ్రులు నేర్పిన విలువలకే కట్టుబడి ఉండటం వల్లనే 'హైవాన్' లాంటి మంచి ప్రాజెక్ట్‌లో అవకాశం సాధించానని ఆమె ఆనందం వ్యక్తం చేశారు.

# ఫీమేల్ సెంట్రిక్ ఇండస్ట్రీహిట్ చిత్రాన్ని బీట్ చేయలేకపోతున్న మాలీవుడ్ స్టార్స్

మాలీవుడ్ ఒక్కొక్క మెట్టు ఎదుగుతోంది. ఎవ్రీ ఇయర్ సరికొత్త రికార్డ్స్ క్రియేట్ చేస్తోంది. వంద కోట్లు కొల్లగొడితే గ్రేట్ అనుకునే స్టేజ్ నుండి 300 కోట్లకు పైగా కొల్లగొట్టే స్థాయికి ఎదిగింది. ఫ్రెండ్లీ బడ్జెట్‌తో సినిమాలు నిర్మించి సక్సెస్ పొందుతోంది. 2024లో మంజుమ్మల్ బాయ్స్ 200 కోట్లు క్రాస్ చేస్తే.. గత ఏడాది ఎంపురన్ దాన్ని బీట్ చేసింది. కానీ ఫీమేల్ సెంట్రిక్ ఫిల్మ్ లోక ఈ రికార్డ్స్ మొత్తం చెరిపేసింది. 300 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టుకుని మాలీవుడ్ హయ్యెస్ట్ గ్రాసర్ చిత్రంగా నిలిచింది. అంతే కాదు సౌత్‌లో హయ్యెస్ట్ గ్రాసర్ ఫీమేల్ లీడ్ మూవీగా టాప్ ప్లేస్‌ని ఆక్యుపై చేసింది. ప్రస్తుతానికి మాలీవుడ్‌లో ఈ నంబర్ ఇంకా పదిలంగానే ఉంది. ఈ ఏడాది మమ్ముట్టి, మోహన్ లాల్ భారీ మల్టీస్టారర్ ఫిల్మ్ పేట్రియాట్ 300 కోట్లను బీట్ చే ేస స ్త ం దే వే ం అనుకున్నారు.. కట్ చేస్తే వంద కోట్లు కూడా క ల క ట చేయలేకపోయింది మూవీ. దృశ్యం3తో లాలట్టన్ టచ్ చేస్తారనుకుంటే సాధ్యపడలేదు. పాన్ ఇండియా ఐడెంటిటీ ఉన్న పృథ్వీరాజ్ సుకుమార్ ఐ నోబడీతో వచ్చాడు. కానీ కలెక్షన్స్ పేలవంగా మారాయి. ఈయన కన్నా చిన్న హీరోలు నయం అనిపించుకున్నారు. ఈ ఏడాది ఆరు నెలలే గడిచింది. లోక నంబర్స్ బీట్ చేయాలంటే ఇంకో 4 నెలలే మిగిలున్నాయి. స్టార్స్ కూడా తమ సినిమాలతో సిద్ధమౌతున్నారు. పృథ్వీ రాజ్ అండ్ దుల్కర్ సల్మాన్ ఓనం పండుగకు వస్తున్నారు. ఇద్దరు ఒకే రోజు బరిలోకి దిగుతున్నారు. ఖలీఫాతో వరద రాజ్ మన్నార్.. ఐయామ్ గేమ్‌తో డీక్యూ ఆగస్ట్ 20లో బరిలోకి దిగుతున్నారు. అలాగే మమ్ముట్టి, మోహన్ లాల్ నెక్స్ట్ సినిమాలతో రెడీగా ఉన్నారు. మరీ ఫీమేల్ సెంట్రిక్ మూవీ కలెక్షన్స్ ఎవరు బీట్ చేస్తారో? ఇండస్ట్రీలో సరికొత్త రికార్డ్ ఎ వరు సృష్టిస్తారో లెట్స్ సీ.



# ఎటు చూసినా నో టెన్షన్

సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా రూపొందుతున్న చిత్రం 'జైలర్ 2'. నెల్సన్ దిలీప్ కుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. 'జైలర్' భారీ విజయం సాధించడంతో ఈ సినిమాపై ఇండియా వ్యాప్తంగా ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా తమిళ్, తెలుగు ఇండస్ట్రీల్లో ఈ చిత్రంపై పెద్ద స్థాయిలో ఆసక్తి నెలకొంది. ఈ చిత్రాన్ని అక్టోబర్ 15న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. అదే సమయంలో తెలుగు నుంచి మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటించిన 'విశ్వంభర' చిత్రాన్ని అక్టోబర్ 16న విడుదల చేయనున్నట్లు, తమిళ్ ఇండస్ట్రీ నుంచి ధనుష్ హీరోగా నటించిన 'ఓం' చిత్రాన్ని కూడా అక్టోబర్ 16న విడుదల చేయాలని ప్లాన్ చేసినట్లు వార్తలు వచ్చాయి.దీంతో 'జైలర్ 2' చిత్రానికి తమిళ్, తెలుగు రెండు ఇండస్ట్రీల్లోనూ గట్టి పోటీ ఎదురయ్యే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. అయితే ఇప్పటివరకు 'విశ్వంభర' విడుదల తేదీపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇక 'ఓం' సినిమాను అక్టోబర్ 16న కాకుండా దీపావళి బరిలో నిలపాలని మేకర్స్ చూస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో 'జైలర్ 2' చిత్రానికి తమిళ్, తెలుగు రెండు ఇండస్ట్రీల్లోనూ ఎలాంటి పోటీ లేకుండా భారీ రిలీజ్ దక్కే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.




Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**